FLASH INDIA NEWS

www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

విలేకరులు కావలెను

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారిగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక :73 | శుక్రవారం 17.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు..

## రాజ్యాంగంలోని ఆర్టికల్ 368(2) ప్రకారం ప్రజాహిత నిర్ణయం

లోక్‌సభ సీట్లు 543 నుంచి సుమారు 815-850 వరకు పెరిగే అవకాశం

ఈ ప్రక్రియ పూర్తవడానికి 2034 ఎన్నికల వరకు సమయం



ఏఐ జనరేటెడ్ ఫోటో

**మహిళా బిల్లులో 'డీలిమిటేషన్' ట్విస్ట్**

- అందులో 33% అంటే సుమారు 272 సీట్లు మహిళలకు రిజర్వ్
- మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగనుంది
- అమలుకు ముందు జనగణన (2027) మరియు డీలిమిటేషన్ అవసరం
- బిల్లుకు 2/3 మెజారిటీ అవసరం - విపక్షాల మద్దతు కీలకం
- డీలిమిటేషన్‌పై విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి
- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని ఆందోళన
- కేంద్రం మాత్రం ఎవరికీ అన్యాయం జరగదని హామీ ఇచ్చింది
- మహిళా సాధికారతకు ఇది కీలక అడుగు అని ప్రభుత్వం చెబుతోంది
- పార్లమెంట్ చరిత్రలో ఇది "సువర్ణాక్షరాల రోజు"గా అభివర్ణించారు
- మహిళల కోసం ఇప్పటికే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపింది

03

### బిల్లుల ఆమోదానికి.. ప్రతిపక్షాల మద్దతు తప్పనిసరి!

'మహిళా రిజర్వేషన్కు అనుకూలం.. కానీ డీలిమిటేషన్కు వ్యతిరేకం'.. విపక్షం వైఖరి ఇది. మరి కేంద్రం ప్రవేశపెట్టే బిల్లుల భవితవ్యం ఏంటి? ప్రస్తుతం లోక్సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మద్దతిస్తేనే రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందుతుంది. ఇందుకోసం 360 మంది సభ్యుల మద్దతు అవసరం.

అధికార కూటమి సభ్యుల సంఖ్య - 292
ప్రతిపక్ష కూటమి సభ్యుల సంఖ్య - 233
తటస్థులు - 15

**సభలో బలాబలాలు.. 'నెంబర్ గేమ్'**

**న్యూఢిల్లీ :**

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 'నారీ శక్తి వందన్ అధినియం' పేరుతో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చబోతోంది. అయితే, ఈ బిల్లు చట్టంగా మారడం ఒక ఎత్తయితే, దాని అమలుకు ముడిపడి ఉన్న సాంకేతిక, రాజకీయ అంశాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

**మారనున్న పార్లమెంట్ స్వరూపం**

ఈ బిల్లు అమలులోకి వస్తే భారత పార్లమెంటు స్వరూపం పూర్తిగా మారనుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 543 నుంచి ఏకంగా 850కి పెరిగే అవకాశం ఉంది. ఇందులో మూడో వంతు అంటే సుమారు 272 సీట్లు మహిళలకు రిజర్వ్ చేయబడతాయి. దీంతో చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం మునుపెన్నడూ లేని విధంగా పెరగనుంది. బిల్లును సూత్రప్రాయంగా సమర్థిస్తున్నప్పటికీ, దీనిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

**బిల్లుకు మరో రెండు అడ్డంకులు**

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ, అది వెంటనే అమలులోకి వచ్చే అవకాశం లేదు. దీనికి ప్రధానంగా రెండు అడ్డంకులు కూడా ఉన్నాయి. మొదటిది, 2027లో జరగబోయే కొత్త జనగణన పూర్తి కావాల్సి ఉంటుంది. రెండోది, ఆ జనగణన గణాంకాల ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చే డీలిమిటేషన్ ప్రక్రియ జరగాలి. ఈ సంక్లిష్ట ప్రక్రియలన్నీ పూర్తి కావాలంటే 2034 సాధారణ ఎన్నికల వరకు సమయం పట్టవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# లోక్‌సభలో.. గరం గరం!

## మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్రం

- మహిళా రిజర్వేషన్లు, రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లు
- సుమారు 15 నుంచి 18 గంటల పాటు చర్చ సాగే అవకాశం
- మహిళా బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ
- బిల్లు ఆమోదానికి తొందరెందుకన్న అఖిలేష్ యాదవ్
- ఇప్పటికే తమ అభిప్రాయం చెప్పామన్న సోనియా గాంధీ
- ఎప్పుడో ఆమోదం పొందిన బిల్లుపై మళ్లీ చర్చా..
- ప్రధాని మోదీని నిలదీసిన ఎంపీ కేసీ వేణుగోపాల్
- ఘాటుగా కౌంటర్ ఇచ్చిన హోమ్ మంత్రి అమిత్ షా

02

నేడు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్



# కౌంటర్లు దాఖలు చేయండి..



- ఎమ్మెల్యేల పార్టీ మార్పు వివాదం తెలంగాణలో సంచలనం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని ఆరోపణ
- స్పీకర్ వారు పార్టీ మారలేదని క్లీన్ చిట్
- ఆ నిర్ణయాన్ని బీఆర్ఎస్ హైకోర్టులో సవాల్ చేసింది
- హైకోర్టు స్పీకర్, 9 మంది ఎమ్మెల్యేలకు కౌంటర్ దాఖలు చేయమని ఆదేశం
- తదుపరి విచారణ మే 6కు వాయిదా

02

స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు ఆదేశం

# తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ..

## తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోలిక


పుండుమీద కారం చల్లొద్దు


రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా...?


త్యాగాలను కించపరచొద్దు..


రాజీనామా చేయాల్సిందే..

- తెలంగాణపై తేజస్వి సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు
- పాకిస్తాన్ విభజనతో పోల్చిన వ్యాఖ్యలపై ఆగ్రహం
- పొన్నం ప్రభాకర్ ఘాటు విమర్శలు
- సభ్యత్వం రద్దు చేయాలన్న డిమాండ్
- పార్లమెంట్‌లోనే క్షమాపణ చెప్పాలన్న డిమాండ్
- బీజేపీ ఎంపీల మౌనం పై ప్రశ్నలు
- హరీష్ రావు, కవిత, కేటీఆర్ ఫైర్
- తెలంగాణ ఆత్మగౌరవానికి దెబ్బ అన్న విమర్శ
- అమరుల త్యాగాలను అవమానించారన్న ఆరోపణ
- బేషరతుగా క్షమాపణ చెప్పాలన్న డిమాండ్
- తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండడంపై ప్రశ్నలు
- బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఈ వ్యాఖ్యలను ఖండించారు
- పార్లమెంట్‌లోనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు
- తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయని విమర్శ

03

తెలంగాణ తల్లికి అవమానం జరుగుతుంటే బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అంటే తల్లిని అమానించడమే నన్నారు. నాడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమంటే పారిపోయిన కిషన్ రెడ్డి ఇవాళ తెలంగాణ తల్లిని అవమానిస్తే మౌనంగా ఉండిపోయారని మండిపడ్డారు. ప్రధాని మోడీ, అమిత్ షా, ఇప్పుడు తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటుపై తప్పుడుగా మాట్లాడారని మండిపడ్డారు. ఇటీవల అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా ఓ టీడీపీ ఎంపీ సైతం ఇదే రకంగా...


# జనాభా గణన షురూ..


ఏఐ జనరేటెడ్ ఫోటో

- ఇప్పటిదాకా ఏడు సార్లు జన గణన ఎనిమిదో సారి డిజిటల్ లో నమోదు
- ఆన్ లైన్ లో సొంతంగా వివరాలు నమోదు చేసుకునే చాన్స్
- ఏపీలో కూడా నేటి నుంచి జనాభా లెక్కలు
- తెలంగాణకు ఇంకా విడుదల కాని షెడ్యూల్
- ప్రతి ఒక్కరూ 33 ప్రశ్నలకు జవాబు ఇవ్వడం తప్పనిసరి
- తప్పుడు వివరాలు చెబితే జరిమానాతో పాటు క్రిమినల్ కేసు కూడా

02

# తెలుగు రాష్ట్రాల్లో ఠారెత్తిస్తున్న ఎండలు..



- తెలుగు రాష్ట్రాల్లో ఠారెత్తిస్తున్న ఎండలు..
- ఏపీలో 275 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు ..
- ఇవాళ 43-44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం..
- తెలంగాణలోనూ మండిపోతున్న ఉష్ణోగ్రతలు..
- పలు ప్రాంతాల్లో 41-45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు..
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్..

02

# లవ్ జిహాద్ నిజమే..

తనను హిందువుగా నటించి నమ్మించాడు

పెళ్లి తర్వాత మతం మార్పించాడని ఆరోపణ




- కూకట్‌పల్లిలో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని యువకుడు మోసం చేసి పెళ్లి చేసుకున్నాడు
- తనను హిందువుగా నటించి నమ్మించాడు
- పెళ్లి తర్వాత మతం మార్పించాడని ఆరోపణ
- ఇప్పటికే రెండు పెళ్లిళ్లు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది
- బెదిరింపులు, దాడులు చేసినట్లు ఆరోపణలు
- సోదరులతో కలిసి సామూహిక అత్యాచారం చేసినట్లు ఆరోపణ

02

# భూతద్దంలో పెట్టీ చూడొద్దు



బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు స్పందించారు. సూర్య వ్యాఖ్యలపై అర్థంపర్థం లేకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని రామచంద్ర రావు మండిపడ్డారు. ఎంపీ సూర్య మాట్లాడిన దాంట్లో అంతరార్థం వేరని, బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని అన్నారు.'తేజస్వి మాటలను భూతద్దంలో పెట్టీ చూడొద్దు. ఆయన తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చలేదు. జేఏసీలో బీజేపీ భాగంగా ఉంది. బీజేపీ లేకుంటే తెలంగాణ వచ్చేదా.

03

# తెలుగు రాష్ట్రాల్లో ఠారెత్తిస్తున్న ఎండలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిప్పుల కొలిమి.. నిప్పుల కుంపటి.. ఈ పదాలకు అర్థాలు తెలుసుకోవాలనుందా.. ఉదయం 9 గంటలకు అలా రోడ్డెక్కండి చాలు.. అర్థాలు తెలుసుకోవడమే కాదు.. స్పెల్లింగ్ కూడా రాసేస్తారు. అట్టుంటది మనతోని అని భాస్కరుడు భగ్గుమంటుంటే.. ఇవేం ఎండల్రా నాయనా అంటూ జనం బెంబేలెత్తిపోతున్నారు. ఏప్రిల్‌లోనే రోహిణి రేంజ్‌లో సూర్యప్రతాపం కనిపిస్తోంటే.. ఇంకో మూడు నాలుగు రోజులు ఇళ్లల్లోనే ఉండండి అని అధికారులు అలర్ట్ చేస్తున్నారు. రెయినీ సీజన్‌లో వానలు దంచికొడుతున్నాయ్ అంటాం కదా.. ఈ సమ్మర్‌లో ఎండ దంచికొడుతోంది అనాల్సి వస్తోంది. ఎందుకంటే.. ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఆరు గంటలకే ప్రజెంట్ సర్ అంటూ అటెండెన్స్ ఇస్తున్న సూర్యుడు.. నిమిష నిమిషానికి నిప్పుల కొలిమిలా మారిపోతున్నాడు. 9 గంటలకే మాడు పగిలే రేంజ్‌లో నిప్పులు కురిపిస్తున్నాడు. పదయ్యే సరికి టెంపరేచర్ సర్రున పెరిగిపోతోంది. ఇంకో అరగంట కాకుండానే.. 40 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు భగభగలుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో దాదాపుగా 45 డిగ్రీల టెంపరేచర్ టచ్ అయింది. మరో మూడు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్న మాటలు.. జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. అత్యవసరమైతే తప్ప ఇళ్లల్లోనుంచి రావొద్దని అధికారులు చెబుతుంటే.. హైరానా పడిపోతున్నారు. మూడు రోజులు వడగాలులు వీచే అవకాశం ఉందని తెలంగాణలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు అధికారులు. అటు ఏపీలో భానుడి ప్రతాపంతో నిప్పుల వర్షం కురుస్తోంది. రాష్ట్రంలోని 275 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పటికే పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతుంటే.. ఇవాళ మరింతగా పెరిగే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. 43 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. మన్యం, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలకు హీట్ అలర్ట్ జారీ చేసింది. 34 మండలాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశముందని.. 67 మండలాల్లో వడగాలుల ప్రభావం ఉండనుందని అంచనా వేసింది. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. పల్నాడు జిల్లా గురజాలలో 44.5 డగ్రీల టెంపరేచర్ నమోదయింది. రాబోయే రెండు, మూడు రోజులు.. 28 మండలాల్లో తీవ్ర వడగాలులు.. 37 మండలాల్లో వడగాలు వీచే అవకాశం ఉంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున్న జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



## డీలిమిటేషన్‌పై రేవంత్ ప్రతిపాదన 'ఫూలిష్'..

**ఢిల్లీ :** లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ యువ నేత, ఎంపీ తేజస్వీ సూర్య ధ్వజమెత్తారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తూనే, కాంగ్రెస్ హయాంలో జరిగిన రాష్ట్ర విభజన తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనను తేజస్వీ సూర్య కొట్టిపారేశారు సీట్ల సంఖ్యను జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న రేవంత్ రెడ్డి సలహా అత్యంత మూర్ఖత్వంగా ఉందన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరు ఇచ్చారో తెలియదు కానీ, దీనిని చూసి తెలంగాణ ప్రజలే నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

**ఏపీ విభజన చెత్తగా చేశారు..**

రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి ఏటా మారుతూ ఉంటుందని, దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవడం హాస్యాస్పదమని తేజస్వీ సూర్య పేర్కొన్నారు. ఆదాయం ప్రకారమే ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలని అనుకుంటే, దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వాల్సి వస్తుందని సైటైర్లు వేశారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తీరుపై తేజస్వీ సూర్య సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటీష్ వారి కంటే చెత్తగా ఉందని.. ఏపీ విభజనను పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని ఆయన విమర్శించారు.

**దక్షిణాదిని తప్పుదారి పట్టిస్తున్నారు..**

డీలిమిటేషన్ బిల్లుపై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని తేజస్వీ సూర్య ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలును ఎలాగైనా అడ్డుకోవాలని, అది ఆలస్యమయ్యేలా చేసేందుకే ప్రతిపక్షాలు ఇటువంటి కొత్త దారులు వెతుకుతున్నాయని ఆయన మండిపడ్డారు.

# లోక్‌సభలో.. గరం గరం!

**ఢిల్లీ :** పార్లమెంటు ప్రత్యేక సమావే శాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపె ట్టిన మూడు కీలక బిల్లులపై చర్చించేందుకు లోక్సభలాంఛనంగా ఆమోదం తెలిపింది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన తదితర అంశాలతో కూడిన ఈ బిల్లులపై సభలో సభ్యులు సుదీర్ఘంగా చర్చలు జరపను న్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులకు ఈ చర్చల జాబితాలో చోటు దక్కింది. ఈ బిల్లులపై విపక్ష, అధికార పక్ష సభ్యుల వాడివేడి చర్చల అనంతరం రేపు (శుక్రవారం) సాయంత్రం సరిగ్గా 4 గంటలకు ఈ మూడు బిల్లులపైన ఓటింగ్ నిర్వహించనున్నట్లు స్పీకర్ ఓం బిర్లా అధి కారికంగా ప్రకటించారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ప్రతిపక్షాలు ఈ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రేపు సభలో జరగబోయే ఓటింగ్ ప్రక్రియ దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ బిల్లులు ఆమోదం పొందాలంటే రేపటి ఓటింగ్ ప్రభుత్వానికి అత్యంత కీలకంగా మారింది.

**అమిత్ షాతో అఖిలేష్ వాగ్వాదం**

మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై లోక్సభలో సమాజ్వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షా మధ్య వాడీ వేడి చర్చ జరిగింది. ఈ ప్రక్రియను జనగణ నతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకో వట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల కేంద్రం దూడుకులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శి స్తోంది. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాలి' అన్నారు. మహిళా రిజర్వే షన్కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

**కుల గణనపై నిర్ణయం తీసుకున్నాం: అమిత్ షా**

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కుల గణన అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. లోక్ సభలో ఈ అంశాన్ని లేవనెత్తిన ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ కు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. కుల గణన చేపట్టడంపై। ప్రభుత్వం ఇప్పటికే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుందని సభలో కుండబద్దలు కొట్టారు. త్వరలోనే దీనికి సంబంధిం చిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని అమిత్ షా స్పష్టం చేశారు.. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నాను' అని హోం మంత్రి అన్నారు.

**మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఒవైసీ ఫైర్..**

కేంద్ర ప్రభుత్వం తీసుకువ చ్చిన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ఎంఐఎం అధినేత అసదు ద్దీన్ ఒవైసీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లులు దేశ సమాఖ్య వ్యవస్థపై తీవ్ర దాడి అని మండిపడ్డారు. చట్టస భల్లో మైనార్టీల ప్రాతినిధ్యాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకే కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించిందని ఆరోపిం చారు. ముస్లిం మహిళలకు ఇందులో ప్రత్యేకంగా ఎలాంటి రిజర్వేషన్లు కల్పించకపోవడం అన్యాయమని, అందుకే ఈ బిల్లులను తాము వ్యతిరేకిస్తున్నామని ఒవైసీ లోక్సభలో స్పష్టం చేశారు.

**డీలిమిటేషన్ బిల్లుపై మా వైఖరి స్పష్టం: సోనియా గాంధీ**

మహిళా రిజ ర్వేషన్, డీలి మిటేషన్ బిల్లులపై కాంగ్రెస్ ఎంపీ సోనియా గాంధీ స్పందించారు. ఈ బిల్లులపై తమ పార్టీ వైఖరిని ఇప్పటికే స్పష్టంగా చెప్పామని, దీనికి మించి తాను కొత్తగా చెప్పేదేమీ లేదని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసు కువస్తున్న ఈ డీలిమిటేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు ఉద్దేశాలను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ పార్టీ దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

**వ్యతిరేకం కాదు... కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్..**

మహిళా రిజర్వేష న్లకు మేం వ్యతిరేకం కాదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గగోయ్ అన్నారు. 'డీలిమిటేషన్కు మాత్రమే వ్యతిరేకం. మహిళా బిల్లు సభలో ప్రవేశపెట్టడం ఇది తొలిసారి కాదు.. గతంలో బిల్లు పెట్టినప్పుడు కూడా ఇవే మాటలు చెప్పారు.. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడం కేంద్రానికి ఇష్టం లేదు.. అందుకే మార్పులు చేస్తున్నారు.. జనగణన తర్వాత డీలిమిటేషన్ అన్నారు.. ఇప్పుడు.. మహిళా రిజర్వేషన్లకు, డీలిమిటేషన్కు లింక్ పెడుతున్నారు." అని గౌరవ్ గగోయ్ ఆరోపించారు.

**రేపు ఓటింగ్ ఉంటుందన్న స్పీకర్ ఓం బిర్లా**

లోక్సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ సహా మూడు కీలక బిల్లులపై రేపు (శుక్రవారం) సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ నిర్వహిం చనున్నట్లు స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక బిల్లులపై సభలో దాదాపు 15 నుంచి 18 గంటల పాటు సుదీర్ఘంగా చర్చ జరగనుందని సభ్యులకు స్పష్టం చేశారు. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరన్ రిజిజు మాట్లాడుతూ.. ఈ బిల్లులపై సభలో కనీసం 12 గంటల పాటు చర్చ జరుగుతుందని, సభ్యుల అభిప్రాయాల మేరకు అవసరమైతే ఈ సమయాన్ని మరింత పొడిగించే పూర్తి అధికారం స్పీకర్కు ఉంటుందని తెలిపారు. ఈ మూడు బిల్లులు అత్యంత కీలకం కావడంతో లోక్సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడిగా చర్చ కొనసాగు తోంది. రేపటి ఓటింగ్ పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**ఎప్పుడో ఆమోదించాం.. కొత్తగా ఈ డ్రామా ఏంటి... కేసీ వేణుగోపాల్..**

"రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం హైజాక్ చేస్తోంది.. ఈ బిల్లుకు అసలు కారణాలు వేరే ఉన్నాయి.. 2023లోనే మహిళా బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చాం.. 2024 నుంచే అమలు చేయమని డిమాండ్ చేశాం.. 33 శాతం మహిళా రిజర్వేషన్లు 2024లో ఎందుకు అమలు చేయలేదు." అని కేంద్రాన్ని కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు.

**సభలో రాజ్యాంగ 131వ సవరణ బిల్లు: అనుకూలంగా 207 ఓట్లు**

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును సభలో ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ కీలక బిల్లును ప్రవేశపెట్టే తీర్మానంపై సభలో ఓటింగ్ నిర్వహించగా మెజారిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ ఓటింగ్లో మొత్తం 333 మంది ఎంపీలు పాల్గొన్నారు. తీర్మానానికి అనుకూలంగా 207 మంది సభ్యులు ఓటు వేయగా, వ్యతిరేకంగా 126 మంది ఎంపీలు ఓటేశారు. సభలో ఉన్న సభ్యుల్లో ఏ ఒక్కరూ ఓటింగ్ కు దూరం కాలేదు. అనుకూలంగా ఎక్కువ ఓట్లు రావడంతో బిల్లును సభలో ప్రవేశపెట్టేందుకు అధికారికంగా అనుమతి లభించింది.

# జనాభా గణన షురూ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశవ్యాప్తంగా 'జనాభా గణన – 2027' ప్రక్రియలో కీలక ఘట్టం ప్రారంభమైంది. నేటి నుంచి ఎనిమిది రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణను చేపట్టనున్నారు. జనాభా గణనలో భాగంగా మొదటి దశ అయిన 'హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ ఆపరేషన్స్' నేటి నుంచి ప్రారంభమవుతోంది. ఇందులో భాగంగా గణన అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి, నివాస గృహాల పరిస్థితి, కుటుంబ సభ్యుల వివరాలు, అందుబాటులో ఉన్న వసతులు మరియు ఆస్తులకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలను అడిగి సమాధానాలు సేకరిస్తారు.

**ఎక్కడెక్కడ ప్రారంభమైంది?**

తొలి విడతగా భాగంగా కర్ణాటక, ఒడిశా, గోవా, మిజోరం, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఢిల్లీలోని ఎన్.డీ.ఎం.సీ , ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో జనగణన ప్రారంభమైంది. మొదటిసారిగా ప్రవేశపెట్టిన 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' అంటే ఆన్‌లైన్ ద్వారా సొంతంగా వివరాల నమోదు చేసే సౌకర్యానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 12 లక్షల కుటుంబాలు ఇప్పటికే అధికారిక పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకున్నాయి. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన వారు, తమకు వచ్చిన SE IDని ఇంటికి వచ్చే అధికారికి చూపిస్తే సరిపోతుంది. మిగిలిన కుటుంబాల వివరాలను అధికారులు నేరుగా ఇంటివద్దే సేకరిస్తారు.

**ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటి నుంచి అంటే..**

ఆంధ్రప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఆన్‌లైన్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ నేటి నుంచి ఏప్రిల్ 30 వరకు అందుబాటులో ఉంటుంది. ఇక్కడ మే 1 నుంచి మే 30 వరకు ఇంటింటి గణన జరుగుతుంది. ఇక బిహార్‌లో ఏప్రిల్ 17 నుంచి సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభమవుతుంది. మే 2 నుంచి ఫీల్డ్ ఆపరేషన్లు మొదలవుతాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు మరియు అభివృద్ధి ప్రణాళికలకు ఈ గణాంకాలు అత్యంత కీలకం కానున్నాయి.



## విపక్షాలు తప్పుడు ప్రచారం

**ఢిల్లీ :** డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, నిజానికి ఈ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు చాలా లాభం జరుగుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఇవాళ లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాట్లాడిన ఆయన డీలిమిటేషన్‌తో తెలంగాణలో లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయని, ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ సీట్లు 25 నుంచి 38 కి పెరుగుతాయన్నారు. తమిళనాడు, కర్ణాటకలోనూ సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాదిలో జనాభా కంటే ఎక్కువ సీట్లు పెరుగుతున్నాయని సౌత్‌లో ఎవరికి అన్యాయం జరుగుతుందో సభ్యులు చెప్పాలన్నారు. చిన్నపిల్లలకు కూడా అర్థమయ్యేలా వివరాలు చెబుతున్నామన్నారు. మొత్తం సీట్లలో 33 శాతం మహిళలకు రిజర్వ్ అవుతాయని, జనరల్ సీట్లలోనూ మహిళలకు అవకాశం ఇస్తే మహిళా ఎంపీల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందన్నారు. జనాభా లెక్కలతోనే కులగణన చేస్తామన్నారు.

# లవ్ జిహాద్ నిజమే..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నగరంలోని కూకట్‌పల్లిలో సంచలనం రేపుతున్న 'లవ్ జిహాద్' ఘటనలో తీవ్రమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని ట్రాప్ చేసిన యువకుడు.. ఆమె మతం మార్చడంతో పాటు, తన సోదరులతో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు ఆరోపించింది. తనపై జరిగిన అకృత్యాలను వివరిస్తూ ఆమె తాజాగా సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ముందుకు వచ్చి కన్నీరుమున్నీరుగా తన ఆవేదనను పంచుకుంది. నెల్లూరుకు చెందిన నవాజ్ అనే వ్యక్తి.. 2025 మే నెలలో కూకట్‌పల్లిలో ట్రేడింగ్, ఫుడ్ బిజినెస్ పేరుతో బాధితురాలి కుటుంబానికి పరిచయమైనట్లు తెలిపింది. తాను హిందువుగా మారిపోయానని, తన పేరు 'నవదుర్గ' అని నమ్మించేందుకు ఏకంగా ఓ సర్టిఫికెట్ కూడా చూపించాడని వెల్లడించింది. నవాజ్ సోదరులు కూడా ఇదే మాట చెప్పి ఆమెను నమ్మించారని, భవిష్యత్తులో దుబాయ్ వెళ్లిపోదామని మాయమాటలు చెప్పి, గత ఏడాది జూలైలో పెళ్లి చేసుకున్నట్లు తెలిపింది. పెళ్లి సమయంలో ఆమె పేరును 'నజీరా'గా మార్చాడని ఆరోపించారు.

**మతం మార్పి, చిత్రహింసలు**

అక్టోబర్ నెలలో నవాజ్‌కు అప్పటికే రెండు పెళ్లిళ్లు అయినట్లు బాధితురాలికి తెలిసింది. దీంతో నవాజ్ ఆమెను బెదిరించడం మొదలుపెట్టాడని, గుల్బర్గాలోని ఖాజా నవాజ్ దర్గా వద్దకు తీసుకెళ్లి బలవంతంగా మతం మార్పించి, కల్మా చదివించాడని తెలిపింది. చెప్పిన మాట వినకపోతే తీవ్రంగా కొట్టేవాడని, బలవంతంగా బీఫ్ (గోమాంసం) తినిపించేవాడని ఆమె ఆరోపించింది. బేగంపేట్‌లో తనకు మత్తు మందు ఇచ్చి అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా.. నవాజ్ తమ్ముళ్లు మునవార్, షారుక్, ఇస్మాయిల్‌లు తనపై సామూహిక అత్యాచారానికి (గ్యాంగ్ రేప్) పాల్పడ్డారని



బాధితురాలు సంచలన ఆరోపణలు చేసింది.

**బ్లాక్ మెయిల్.. ఆర్థిక దోపిడీ**

తన ఫొటోలు, వీడియోలు అడ్డం పెట్టుకుని నవాజ్ తనను బ్లాక్ మెయిల్ చేశాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే తన తల్లిని, చెల్లిని చంపేస్తానని బెదిరించాడని యువతి వాపోయింది. తన పేరు మీద లోన్లు తీసుకోవడంతో పాటు, తన బంగారాన్ని మణత్తూట్ ఫైనాన్స్‌లో కుదవపెట్టి డబ్బులు కాజేశాడని, శంషాబాద్‌లోని ఓ ఫ్లాట్‌ను సైతం అమ్మేశాడని తెలిపింది. ఈ దారుణాలపై బాధితురాలు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. నిందితుడు నవాజ్ హైదరాబాద్ నుంచి నెల్లూరుకు పారిపోయాడు. పైగా తాను ఏ తప్పు చేయలేదని, ఆ అమ్మాయే తనను ట్రాప్ చేసిందంటూ కేసును తప్పుదోవ పట్టించేలా ఓ వీడియోను విడుదల చేశాడు. ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకే తాను మీడియా ముందుకు వచ్చానని బాధితురాలు స్పష్టం చేసింది.

**లవ్ జిహాద్ నిజమే..**


'లవ్ జిహాద్ నిజమే. హిందూ అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారు. నేను దానికి బాధితురాలిని. నా ఫోటోలు, వీడియోల కోసమే ఇన్నాళ్లు వాళ్ల బెదిరింపులకు భయపడ్డాను. కానీ నాకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదనే ఉద్దేశంతోనే ధైర్యంగా బయటకు వచ్చి ఈ విషయాలు చెబుతున్నాను.' అని బాధితురాలు సంచలన ఆరోపణలు చేసింది.

# కౌంటర్లు దాఖలు చేయండి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలను హైకోర్టు ఆదేశించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, సంజయ్, తెల్లం వెంకట్రావుతో పాటు స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణ మే 6వ తేదీకి వాయిదా వేసింది.

**హైకోర్టుకు బీఆర్ఎస్:**

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, డా. సంజయ్ , దానం, కడియం ఆ తరువాత కాంగ్రెస్ గూటికి చేరారని బీఆర్ఎస్, బీజేపీ ఆరోపిస్తూ వీరి పై వేటు వేయాలని సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. ఈ క్రమంలో విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం తీసుకోవాలని గతంలోనే స్పీకర్ ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన స్పీకర్ వీరంతా పార్టీ మారడానికి సరైన ఆధారాలు లేవంటూ ఈ పదిమందికి క్లిన్ చిట్ ఇచ్చారు. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ హైకోర్టులో సవాల్ చేసింది. ఇందులో గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్ తో సన్నిహితంగా ఉంటున్న నేపథ్యంలో ఆయన పేరును తమ పిటిషన్ లో పేర్కొనలేదు. ఈ నేపథ్యంలో ఇవాళ విచారణ జరిపిన హైకోర్టు గూడెం మినహా మిగతా 9 మంది ఎమ్మెల్యేలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కౌంటర్ దాఖలు చేయమని ఆదేశించింది. మరి ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో చూడాలి.



## మైక్రో ఫైనాన్స్ స్కామ్‌లో బిగ్ ట్విస్ట్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మైక్రో ఫైనాన్స్ మోసం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రమావత్ మధును సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొంతకాలంగా పరారీలో ఉన్న మధును సాంకేతిక ఆధారాలతో పట్టుకున్న పోలీసులు, అతనిపై ఇప్పటికే నమోదైన పలు కేసుల ఆధారంగా విచారణను వేగవంతం చేశారు. అరెస్టుకు ముందు మధు ఒక వీడియోను విడుదల చేసి, ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు రహస్యాలను బయటపెట్టడం గమనార్హం. ఈ కేసులో తాను అప్రూవర్‌గా మారుతున్నట్లు ప్రకటించిన మధు, పలువురు ప్రముఖుల పేర్లను ప్రస్తావించారు. ఈ కేసులో ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ గాయని మంగ్లీకి (సత్యవతి రాథోడ్) మధు క్లీన్ చిట్ ఇచ్చారు. "ఈ మైక్రో ఫైనాన్స్ వ్యవహారంతో సింగర్ మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదు. ఆమెను అనవసరంగా ఈ వివాదంలోకి లాగారు" అని మధు ఆ వీడియోలో స్పష్టం చేశారు. ఆమె పేరు వాడుకుని కొందరు లబ్ధి పొందే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. కుంభకోణం వెనుక అసలు వ్యక్తులు హిమాకాంత్ రెడ్డి అని కుండబద్దలు కొట్టారు. హిమాకాంత్ రెడ్డి ఏకంగా రూ. 20 కోట్లు తీసుకున్నాడని మధు వెల్లడించారు. అడ్వకేట్ సుబ్బారావు, హిమాకాంత్ రెడ్డి మంచి స్నేహితులని.. హిమాకాంత్ నుంచి డబ్బులు ఇప్పిస్తానని సుబ్బారావు తనకు భరోసా ఇచ్చారని మధు ఆ వీడియోలో పేర్కొన్నారు.

# సీఎంతో పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి భేటీ



**ఢిల్లీ :** న్యూ ఢిల్లీలో గురువారం నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డితో పాటు సీఎం రేవంత్ రెడ్డిని నిర్మల్ జిల్లా మాజీ జడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యులు నిరంజన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, రాజ్య సభ సభ్యులు అనిల్ యాదవ్, మైనారిటీ కామారెడ్డి సభ్యులు షబ్బీర్ అలీ తదితరులు కూడా కలిశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక బహిష్కరణ

**ఢిల్లీ :** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు, నారీశక్తి వందన్ చట్టసవరణ, డీలిమిటేషన్ బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టింది. అయితే బిల్లులపై ఇండియా కూటమి నేతలు తీవ్ర వ్యతిరేకతన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికలను బహిష్కరించాలని భారత కూటమి పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి. ఏప్రిల్ 9న హరివంశ్ పదవీకాలం ముగియడంతో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవి ఖాళీ అయింది. అయితే తిరిగి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచే రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇక హరివంశ్ ఏప్రిల్ 10న ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే తాజాగా జరుగుతున్న ప్రత్యేక సమావేశాల్లో భాగంగా ఏప్రిల్ 17న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక చేపట్టనున్నారు. అయితే డిప్యూటీ చైర్మన్ రేసులో మళ్లీ హరివంశ్ పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. తిరిగి ఆయన్నే ఎన్నుకుంటారా? లేదంటే మరొకరికి ఛాన్స్ ఇస్తారా? అన్నది తేలాల్సి ఉంది. ఇదిలా ఉంటే 2019 నుంచి లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. కానీ ఇటీవల ఖాళీ అయిన రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పదవిని భర్తీ చేయడానికి ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధపడుతుండడంతో కాంగ్రెస్, టీఎంసీ, వామపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ నియామకాన్ని ప్రభుత్వం బలవంతంగా చేయించాలని చూస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది.

# అఖిలేష్‌కు అమిత్ షా కౌంటర్..

## మీ టికెట్లు అన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వండి..



**ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీసుకురాబోంది. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఈ బిల్లులపై చర్చకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. అయితే, పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మహిళకు 33 శాతం రిజర్వేషన్ల కోసం మూడు కీలక బిల్లులు అవసరమని ప్రభుత్వం వాదిస్తోంది. అయితే, ఈ బిల్లులు రాజ్యంగపరమైన ప్రశ్నల్ని లేవనెత్తుతున్నాయని ప్రతిపక్షాలు అంటున్నాయి. ఇదిలా ఉంటే, మహిళా రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాత ముస్లిం మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని అఖిలేష్ యాదవ్ అన్నారు. జనాభా లెక్కల కోసం ప్రభుత్వం ఎందుకు వేచిచూడటం లేదని ప్రశ్నించారు. తన పార్టీ కుల గణనను కూడా డిమాండ్ చేస్తోందని ఆయన అన్నారు. దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. జనాభా గణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలపై అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. ముస్లిం మహిళు జనాభాలో సగం మంది అని చెబుతూ, వారు జనాభాలో భాగం కాదా? అని ప్రశ్నించారు.

# ఓటింగ్‌లో ప్రభుత్వం విజయం..

## లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టేందుకు లైన్ క్లియర్

**ఢిల్లీ :** లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లులో భాగంగా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే రాజ్యాంగ సవరణ బిల్లును అనుమతించాలా వద్దా అన్న అంశంపై సభలో అధికార, విపక్ష నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. డీలిమిటేషన్ బిల్లును బేషరతుగా వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజనకు ఇంత తొందర ఎందుకని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జనగణన చేస్తే కులగణన అడుగుతారని, కులగణన చేస్తే రిజర్వేషన్లు అడుగుతారని, అవన్నీ తప్పించుకోవడం కోసమే ఇంత ఆతృతగా బిల్లులను ప్రవేశపెడుతున్నారని ఆయన ఆరోపించారు.

**దేశంలో జనగణన ప్రారంభమైంది: అమిత్ షా**

ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమాధానమిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. కులగణనతో పాటే జనగణన జరుగుతుందనే విషయాన్ని ప్రతిపక్ష నేతలు విస్మరించినట్లున్నారు అంటూ సెటైర్లు వేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభమైందని సభకు తెలిపారు. ముస్లిం మహిళల

రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారని.. కానీ మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదని ఆయన వ్యాఖ్యానించారు.

**బిల్లుపై డివిజన్ కోరిన విపక్షాలు..**

లోక్‌సభ ముందుకు 131వ రాజ్యాంగ సవరణ బిల్లు రాగా.. బిల్లుపై పార్టీల అభిప్రాయాలను స్పీకర్ ఓం బిర్లా తెలుసుకున్నారు. ఈ బిల్లును కాంగ్రెస్‌తో పాటు ఎస్పీ, టీఎంసీ, ఆర్ఎస్పీ , డీఎంకే, ఎంఐఎం, సీపీఎం వ్యతిరేకించాయి. అదేవిధంగా లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టాలా వద్దా అనే అంశంపై విపక్షాలు 'డివిజన్' (ఓటింగ్) కోరగా స్పీకర్ ఓం బిర్లా అంగీకరించారు. బిల్లు ప్రవేశంపై నిర్వహించిన ఓటింగ్‌లో 333 మంది సభ్యులు పాల్గొనగా.. అనుకూలంగా 207 మంది, వ్యతిరేకంగా 126 మంది ఓటేశారు. దీంతో వచ్చిన మెజారిటీ ఆధారంగా లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టేందుకు లైన్ క్లియర్ అయింది.

# లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు..

**ఢిల్లీ :** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 'నారీ శక్తి వందన్ అధినియం' పేరుతో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చబోతోంది. అయితే, ఈ బిల్లు చట్టంగా మారడం ఒక ఎత్తయితే, దాని అమలుకు ముడిపడి ఉన్న సాంకేతిక, రాజకీయ అంశాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

**మారనున్న పార్లమెంట్ స్వరూపం**

ఈ బిల్లు అమలులోకి వస్తే భారత పార్లమెంటు స్వరూపం పూర్తిగా మారనుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 543 నుంచి ఏకంగా 850కి పెరిగే అవకాశం ఉంది. ఇందులో మూడో వంతు అంటే సుమారు 272 సీట్లు మహిళలకు రిజర్వ్ చేయబడతాయి. దీంతో చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం మునుపెన్నడూ లేని విధంగా పెరగనుంది. బిల్లును సూత్రప్రాయంగా సమర్థిస్తున్నప్పటికీ, దీనిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

**బిల్లుకు మరో రెండు అడ్డంకులు**

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ, అది వెంటనే అమలులోకి వచ్చే అవకాశం లేదు. దీనికి ప్రధానంగా రెండు అడ్డంకులు కూడా ఉన్నాయి. మొదటిది, 2027లో జరగబోయే కొత్త జనగణన పూర్తి కావాల్సి ఉంటుంది. రెండోది, ఆ జనగణన గణాంకాల ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చే డీలిమిటేషన్ ప్రక్రియ జరగాలి. ఈ సంక్లిష్ట ప్రక్రియలన్నీ పూర్తి కావాలంటే 2034 సాధారణ ఎన్నికల వరకు సమయం పట్టవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**సభలో బలాబలాలు.. 'నెంబర్ గేమ్'**

రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గాలంటే సభలో మూడింట రెండు వంతుల (2/3) మెజారిటీ తప్పనిసరి. ప్రస్తుతం లోక్‌సభలో 537 మంది సభ్యుల బలం ఉండగా, బిల్లు ఆమోదానికి 360 ఓట్లు కావాలి. కానీ అధికార ఎన్డీయే బలం 293 మాత్రమే ఉండటంతో విపక్షాల మద్దతు అనివార్యంగా మారింది. అలాగే రాజ్యసభ లోనూ మెజారిటీ మార్క్ 163 కాగా, ఎన్డీయేకు 142 కంటే ఎక్కువ సభ్యుల బలం ఉంది. ఇక్కడ కూడా మరో 21 ఓట్ల మద్దతు ప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. ఇక జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, జనాభా నియంత్రణను విజయవంతంగా పాటిస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా ప్రస్తుతమున్న 543 సీట్లలోనే మహిళా కోటాను వెంటనే అమలు చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం ఈ బిల్లు మహిళా సాధికారతకు నిదర్శనమని, ఎవరికీ అన్యాయం జరగకుండా నిష్పక్షపాతంగా ప్రక్రియ సాగుతుందని హామీ ఇస్తోంది.

**లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు.. కేంద్రం క్లారిటీ**

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఈ మేరకు ఇవాళ లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం 3 కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లులపై చర్చసందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ మాట్లాడుతూ.. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లు వల్ల ఏ రాష్ట్రానికి గాని, పురుషులకు గానీ ఎలాంటి నష్టం జరగదని స్పష్టం చేశారు. రాష్ట్రాలు లోక్‌సభ సీట్లు కోల్పోవన్నారు. ఈ బిల్లులతో లోక్‌సభ స్థానాల సంఖ్యను 815కు పెరిగితే, మహిళలకు లోక్‌సభలో 272 సీట్లు లభిస్తాయన్నారు.

**సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు:**

ఈ రోజు పార్లమెంట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అని మేఘ్‌వాల్ అన్నారు. 2023లోనే నారీశక్తి వందన్ అధినియం బిల్లును ఆమోదం పొందింది. మహిళకు 33 శాతం రిజర్వేషన్లపై ఇప్పటికే పార్లమెంట్ ఆమోదం లభించిందని ఇక మహిళా రిజజర్వేషన్లను అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కొన్ని బిల్లులను భావితరాలు మరువలేదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 368(2) ప్రకారం ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవచ్చని చెప్పారు. ఆర్టికల్ 368 ద్వారా ద్వారా ప్రజాహిత నిర్ణయాలకు పార్లమెంట్‌కు రాజ్యాంగం శక్తి ఇచ్చిందని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే మూడు బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ బిల్లు ద్వారా మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. మహిళలకు సామాజిక న్యాయం కోసం కేంద్రం అనేక పథకాలు తెచ్చిందని మహిళలకు శౌచాలయాలు, ఉజ్వల యోజన అమలు చేశామన్నారు. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం జరగాల్సిందేనన్నారు. మహిళలకు జన్‌ధన్ ఖాతాలు, పీఎం ముద్రా యోజన, సుకన్య సమృద్ధి యోజన, లఖ్ పతీ దీదీ వంటి పథకాలు అమలు చేశామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు చేయూత నిచ్చాం. మహిళల రిజర్వషన్లకు సంబంధించి మూడేళ్ల క్రితం ఇవే చర్చలు జరిగాయి.

# భూతద్దంలో పెట్టి చూడొద్దు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు స్పందించారు. సూర్య వ్యాఖ్యలపై అర్థంపర్థం లేకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని రామచంద్ర రావు మండిపడ్డారు. ఎంపీ సూర్య మాట్లాడిన దాంట్లో అంతరార్థం వేరని, బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని అన్నారు.'తేజస్వి మాటలను భూతద్దంలో పెట్టి చూడొద్దు. ఆయన తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చలేదు. జేఏసీలో బీజేపీ భాగంగా ఉంది. బీజేపీ లేకుంటే తెలంగాణ వచ్చేదా. తెలంగాణ ఏర్పాటుపై లోక్‌సభలో జరిగిన చర్చ సమయంలో బీఆర్ఎస్ ఇద్దరు సభ్యులు లేరు. అదే



సమయంలో రాష్ట్ర ఏర్పాటు ను కాంగ్రెస్ యూటర్న్ తీసుకుంది. దీంతో అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరందరి ఆత్మహత్యలకు కాంగ్రెస్ పార్టీ కారణం కాదా. వాజపేయి చాలా సాఫీగా ఒక్క రక్తం చుక్క పడకుండా మూడు రాష్ట్రాలు ఇచ్చారు' అని రామచంద్ర రావు గుర్తు చేశారు.

# దేశ ప్రగతి కోసం



**ఢిల్లీ :** దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ వేదికగా మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ఈ బిల్లు దేశానికి సరికొత్త దశను, దిశను నిర్దేశిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడంలో తమకు ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవని ప్రధాని స్పష్టం చేశారు. "ఇది కేవలం రాజకీయ పార్టీల ప్రయోజనాల కోసం తెచ్చిన బిల్లు కాదు.. దేశ ప్రజల ప్రయోజనం కోసం, దేశ ప్రగతి కోసం తెచ్చిన బిల్లు" అని ఆయన పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర చాలా కీలకమని, వారికి తగిన అవకాశం కల్పిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని ఆయన కొనియాడారు. వికసిత్ భారత్ అంటే కేవలం రోడ్లు, రైళ్లు, భవనాలు వంటి మౌలిక సదుపాయాలు మాత్రమే కాదని.. అన్ని వర్గాల, అన్ని రంగాల ప్రజల సమగ్ర అభివృద్ధే అసలైన వికసిత్ భారత్ అని పేర్కొన్నారు.

**గత పాలకులపై విమర్శలు...**

మహిళా బిల్లు విషయంలో గత ప్రభుత్వాల తీరును ప్రధాని ఎండగట్టారు. "30 ఏళ్ల క్రితమే మహిళా బిల్లు తెచ్చామంటున్న వారు, దాని వల్ల ఎవరికైనా మేలు జరిగిందా? అని ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని ప్రశ్నించారు. తమకు అన్యాయం చేసిన వారిని మహిళలు సమయం చూసి దెబ్బకొడతారని ఆయన హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును దేశవ్యాప్తంగా ప్రజలందరూ స్వాగతిస్తున్నారని మోడీ తెలిపారు. ఈ బిల్లు విషయంలో ఎలాంటి రాజకీయాలు చేయకుండా, పక్షపాతాలకు అతీతంగా సభ్యులందరూ ఏకగ్రీవంగా మద్దతు తెలపాలని ప్రధాని పార్లమెంట్ సాక్షిగా కోరారు.

**పార్లమెంట్ వేదికగా ప్రధాని క్లారిటీ**

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని విపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న వేళ ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టత ఇచ్చారు. ఉత్తరాది, దక్షిణాది అని మాకు తేడా లేదని కశ్మీర్ టు కన్యాకుమారి అన్ని ప్రాంతాలు మాకు సమానమేనన్నారు. డీలిమిటేషన్ బిల్లుతో చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదన్నారు. మీకు గ్యారెంటీ కావాలంటే నా మాటే గ్యారెంటీ అన్నారు. ఇవాళ లోక్ సభలో జరిగిన చర్చ సందర్భంగా మోడీ మాట్లాడారు. ఏ రాష్ట్రంపైనా మాకు వివక్ష లేదన్నారు.

**నాకు క్రెడిట్ అక్కర్లేదు:**

మోడీ స్వార్థం కోసం మహిళా రిజర్వేషన్ల బిల్లు తెచ్చారని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదన్నారు. బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తే నాకే లాభం అని మహిలా రిజర్వేషన్ బిల్లుపై నాకు క్రెడిట్ అవసరం లేదన్నారు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ రేపు ప్రకటన ఇస్తానన్నారు. పంచాయతీల్లో మహిలా రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్ సభలో అమలు చేస్తుంటే అడ్డుకుంటున్నారు. మహిళల్లో రాజకీయ చైతన్యం బాగా పెరిగింది. పంచాయతీల్లోనే కాదు అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుకుంటున్నారు. పార్లమెంట్ పై నాకు నమ్మకం ఉందని వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తామన్నారు.

# తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ లోక్ సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తేజస్వీ సూర్య తెలివిలేని వెధవ అని ఘాటు వ్యాఖ్యలతో మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన రాష్ట్ర ఏర్పాటుపై అజ్ఞానంగా మాట్లాడారని అతడి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇవాళ గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన పొన్నం.. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. తేజస్వీ మాటలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు తెలంగాణ బిడ్డలైతే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇది ఏ ఒక్కరికో అవమానం కాదని ఇది మన ఉద్యమాన్ని, మన రాష్ట్రాన్ని అమానించడమేనన్నారు. మరొకరు తెలంగాణ ఏర్పాటుపై నోరువిప్పే ధైర్యం చేయకుండా చట్ట ప్రకారం బుద్ధి చెప్పాల్సి ఉందన్నారు. దీనిపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలన్నారు. తేజస్వీ సూర్యపై చర్య తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ కు లేఖ రాస్తున్నట్లు చెప్పారు.

**పుండుమీద కారం చల్లొద్దు:**

తెలంగాణ తల్లికి అవమానం జరుగుతుంటే బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అంటే తల్లిని అమానించడమేనన్నారు. నాడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమంటే పారిపోయిన కిషన్ రెడ్డి ఇవాళ తెలంగాణ తల్లిని అవమానిస్తే మౌనంగా ఉండిపోయారని మండిపడ్డారు. ప్రధాని మోడీ, అమిత్ షా, ఇప్పుడు తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటుపై తప్పుడుగా మాట్లాడారని మండిపడ్డారు. ఇటీవల అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా ఓ టీడీపీ ఎంపీ సైతం ఇదే రకంగా మాట్లాడారని ఇటువంటి అజ్ఞానులు, ధన బలం, మందబలంతోనో పార్లమెంట్ కు వస్తే అలాంటి వారి పార్టీ అయినా బుద్ధి చెప్పాలి కదా అన్నారు. సహృద్భావ వాతావరణంలో బతకాల్సిన పరిస్థితుల్లో తెలంగాణ ఏర్పాటుపై అనుచితంగా మాట్లాడుతూ పుండుమీద కారం చల్లినట్లు వ్యవహిస్తున్నారని మండిపడ్డారు.

**అదే పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పాలి: హరీష్ రావు సీరియస్**

బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ ఆవిర్భావంతో పోల్చడంపై ఆ పార్టీ ముఖ్య నేత హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కీలక ట్వీట్ చేశారు. పార్లమెంట్ వేదికగా ఒక బాధ్యతాయుతమైన ఎంపీ ఈ రకమైన వ్యాఖ్యలు చేయడం, ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని మండిపడ్డారు. "తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడం చారిత్రక తప్పిదం మాత్రమే కాదు, తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరచడమే. ఇది భారత సమాఖ్య స్ఫూర్తి పట్ల బీజేపీకి ఉన్న అజ్ఞానాన్ని సూచిస్తోంది" అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

**త్యాగాలను కించపరచొద్దు..**

దశాబ్దాల పాటు సాగిన ప్రజాస్వామ్య పోరాటం, విద్యార్థులు, యువకులు మరియు అమరుల బలిదానాల ఫలితంగా తెలంగాణ సిద్ధించిందని బీఆర్ఎస్ గుర్తు చేశారు. భారత రాజ్యాంగ పరిధిలోనే శాంతియుత మార్గంలో పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని, రక్తసిక్తమైన విభజన (పాకిస్థాన్ ఏర్పాటు) తో పోల్చడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. 2014లో తెలంగాణ ఏర్పాటు అనేది ప్రజా ఆకాంక్షల ప్రతిరూపమని, దీనిని తక్కువ చేసి మాట్లాడటం ప్రాంతీయ ఉద్యమాలపై బీజేపీకి ఉన్న చులకన భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, గౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య, బీజేపీ వెంటనే తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. "రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరిస్తూ, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను సహించేది లేదు. తెలంగాణ చరిత్రను, గౌరవాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని హరీష్ రావు స్పష్టం చేశారు.

**నీకు ఎంత ధైర్యం..?.. తేజస్వి సూర్యపై కవిత నిప్పులు**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్ వేదికగా చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నీకు ఎంత ధైర్యం..?" అంటూ ఆమె సోషల్ మీడియా వేదికగా నిలదీశారు. తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నిండు పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటును అవమానించడం అంటే, తెలంగాణ కోసం పోరాడిన కోట్లాది మంది ప్రజలను అవమానించడమేనని కవిత పేర్కొన్నారు. "ఈ వ్యాఖ్యలు కేవలం రాజకీయ-ౖమైనవి కావు.. తెలంగాణను సాకారం చేయడానికి తమ ప్రాణాలను త్యాగం చేసిన వేలాది మంది అమరులను అగౌరవపర్చడమే. మా భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం సరికాదు" అని ఆమె స్పష్టం చేశారు.

**రాజీనామా చేయాల్సిందే..**

తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తేజస్వి సూర్య, తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను సహించే ప్రసక్తే లేదని ఆమె హెచ్చరించారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, నాయకులపై కూడా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణ ప్రయోజనాలను కాపాడకపోతే, రాష్ట్రాన్ని అవమానించిన వారికి బుద్ధి చెప్పకపోతే.. మీకు పదవుల్లో ఉండే అర్హత లేదు" అని పేర్కొన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నగేశ్ వంటి నేతలు తమ సొంత రాష్ట్రం పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, లేదంటే ప్రజలకు సమాధానం చెప్పలేరని కవిత హెచ్చరించారు.

**తెలంగాణపై వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉంది: తేజస్వి సూర్యపై కేటీఆర్ ఫైర్**

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని ఆయన మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోడీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరూ తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ.. బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు.

**రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా...?**

తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని ఆయన గుర్తుచేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు.

**క్షమాపణ చెప్పాల్సిందే...**

తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

సంపాదకీయం

# పెరుగుతున్న సైబర్ నేరాలు

డిజిటల్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగింది. దానితోపాటే సైబర్ నేరగాళ్లకు దోపిడీ ఈజీ అయ్యింది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం.. ఇలా రకరకాల యాప్స్ వాడుతున్న ప్రజలంతా డేంజర్ జోన్ లోనే ఉన్నట్లు కనిపిస్తున్నది. వాట్సాప్, మెయిల్, ట్విట్టర్, ఫేస్ బుక్, థ్రెడ్స్ వంటి సోషల్ మీడియా అకౌంట్స్ కి గుర్తు తెలియని లింక్స్ వస్తున్నాయి. వాటిని క్లిక్ చేస్తే చాలు.. అకౌంట్లో ఉన్న డబ్బులన్నీ మాయమవుతున్నాయి. ఇది కేవలం నిరక్షరాస్యులకే పరిమితం కాలేదు. రోజూ స్మార్ట్ ఫోన్ వాడే విద్యావంతులు, ప్రముఖులు సైతం సైబర్ కేటుగాళ్ల వలలో పడి బలవుతున్నారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ రోజుకో తీరున పోస్టర్ రిలీజ్ అలర్ట్స్ పంపిస్తున్నారు. కానీ నేరగాళ్లు ప్రతి రోజూ కొత్త పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారు. తలుపులు బద్దలు కొట్టే పని లేకుండానే డిజిటల్ దొంగలు అదృశ్యంగా దోచేస్తున్నారు. ఏది క్లిక్ చేయకపోయినా.. నా అకౌంట్లో డబ్బులు మాయమయ్యాయంటూ గగ్గోలు పెట్టే బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నది.

### లెక్కలు వింటే.. వామ్మో అనాల్సిందే..

2022 నుంచి 2026 వరకు రాష్ట్రంలో వచ్చిన సైబర్ నేరాల ఫిర్యాదులు, నమోదైన కేసులు, బాధితులు, పోగొట్టుకున్న డబ్బులు, రికవరీ, పెండింగ్ అమౌంట్ వంటి వివరాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నుంచి యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి సేకరించారు. ఈ లెక్కలు వింటే వామ్మో అనాల్సిందే. 2022 నుంచి 2026 ఫిబ్రవరి వరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షలకు పైగా ఫిర్యాదులు రాగా, 76,048 కేసులు నమోదయ్యాయి. ఏకంగా రూ.4,724 కోట్లు దోచుకున్నారు. ఇంకా ఫిర్యాదు చేయని బాధితులు లక్షల్లో ఉన్నట్లు చర్చ జరుగుతున్నది. న్యూడ్ ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తే మోసపోయి సమర్పించుకున్న సొమ్ము ఇంకెన్ని రూ.కోట్లు ఉంటుందో అంచనా వేయడం కష్టమే. రిటైర్డ్ ఉద్యోగులు, అధికారులే కాదు.. ఆఖరికి ఎమ్మెల్యేలు కూడా డబ్బులు సమర్పించుకుంటున్నారు. అయితే రూ.వేలల్లో పోగొట్టుకున్న వారు ఫిర్యాదు చేసి ఇజ్జత్ పోగొట్టుకోవడం ఎందుకని పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడం లేదనే చర్చ జరుగుతున్నది.

### పట్టణ ప్రాంతాల్లోనే అధికం

డిజిటల్ చెల్లింపులు పల్లె, పట్నం అనే తేడా లేకుండా అంతటా విస్తరించాయి. చిన్న కరివేపాకు కట్ట కొన్నా డిజిటల్ పేమెంట్ చేస్తున్నారు. ఆఖరికి గుడి దగ్గర యాచకులు సైతం క్యూ ఆర్ కోడ్ పట్టుకొని కూర్చుంటున్నారు. అయితే రాష్ట్రంలో నమోదైన సైబర్ నేరాల్లో అత్యధికం పట్టణాల్లోనే జరుగుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోనే ఎక్కువ కేసులు నమోదు కావడం గమనార్హం. మొబైల్ వాడకం పెరుగుతున్నా కొద్దీ నేరాలకు ఆస్కారం పెరుగుతున్నట్లు చర్చ జరుగుతున్నది. దీంతో ఇలాంటి మోసాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం సోషల్ మీడియా అవేర్ నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### ప్రజలకు అవగాహన కల్పించాలి

సోషల్ మీడియా, టెక్నాలజీ పెరుగుతున్నా కొద్దీ సైబర్ మోసాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సైబర్ కేటుగాళ్లు అమాయక ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త పద్ధతులు అవలంభిస్తున్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ వాడుకుంటున్నారు. రూ.లక్షలు, రూ.కోట్లు దోచుకుంటున్నారు. బాధితులు సర్వం కోల్పోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో సైబర్ మోసాలపై కొంత మంది శిక్షకులను ఏర్పాటు చేసి నిరంతరం అవగాహన కల్పిస్తూ ఉండాలి. ప్రభుత్వాలు అంతా టెక్నాలజీ, పేపర్ లెస్ మనీ తేవాలి అంటున్నారు. అలాంటప్పుడు సైబర్ మోసాలను ఆదిలోనే అరికట్టకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు దాచుకున్న డబ్బులకు రక్షణ కరువవుతుంది.

# ప్రత్యర్థి పార్టీల సెటైర్లు!



ఆ పార్టీ ఓల్డ్ ఏజ్ హోమ్ అవ్వబోతుందా.. అందరూ వృద్ధ నాయకులను పార్టీలోకి తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయా.. అలాంటి విమర్శలకు పార్టీ ఎలాంటి సమాధానమిస్తుంది.. ఈ ఓల్డ్ ఏజ్ హోమ్ కామెంట్ పై పార్టీలో ప్రశ్నిస్తున్న యువ నేతలకు పార్టీ ఎలాంటి భరోసా ఇస్తుంది.. వాచ్ దిస్ స్టోరీ.కాంగ్రెస్‌ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి, చివరికి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి కారెక్కేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆయన అధికారికంగా చేరకముందే గులాబీ తోటలో చిన్నపాటి ప్రకంపనలకు కారణమయ్యారు. బీఆర్ఎస్ కూడా పార్టీలో చేరకముందే జీవన్ రెడ్డికి టాప్ ప్రయారిటీని చేతల్లో చూపించింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనని పార్టీలోకి ఆహ్వానించడం, ఆ తర్వాత ఆయన స్వయంగా వచ్చి అధినేత కేసీఆర్ కలవడం చకచకా జరిగిపోయాయి. ఇదే సమయంలో బీఆర్ఎస్ పై సోషల్ మీడియాలో ఓ కామెంట్ వైరల్ అవుతోంది. బీఆర్ఎస్ ఓల్డేజ్ హోమ్‌గా మారిందన్న కామెంట్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటివరకు అనేక పార్టీలు తిరిగి, తమ రాజకీయ ప్రస్థానం ముగించే సమయానికి బిఆర్ఎస్ లో చేరుతున్నారన్న సెటైర్లు పేలిపోతున్నాయి. వృద్ధ నాయకులకు షెల్టర్ జోన్‌గా మారిపోయిందన్న కామెంట్లు చేస్తున్నారు. గతంలో మాజీ మంత్రులు నాగం జనార్ధన్ రెడ్డి, పొన్నాల లక్ష్మయ్యతో పాటు ఇప్పుడు చేరబోతున్న జీవన్ రెడ్డిని అందుకు ఉదాహరణగా చెబుతున్నారు.సోషల్ మీడియాలోనో, ప్రత్యర్థి పార్టీల నాయకులో ఇలాంటి వ్యాఖ్యలు చెయ్యడం లేదు. సొంత పార్టీలోని కొందరు యువ కార్యకర్తలు ఇలాంటి కామెంట్లు చేస్తున్నారన్న తెలుస్తోంది. అన్ని పదవులు అనుభవించిన ముసలి నేతలకే మళ్లీమళ్లీ అవకాశాలిస్తే...తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారట. అంతటితో ఆగని యువ నేతలు...సదరు ఓల్డేజ్ లీడర్లు పెద్దపెద్ద పదవులు అనుభవించి వచ్చినదారిలోనే తుర్రుంటారని ఉదాహరణలతో సహా చెబుతున్నారు. అయితే, గులాబీ అధిష్టానం మాత్రం వీరందరికి సర్దిజెప్పే ప్రయత్నం చేస్తోంది. బయట ఎన్ని విమర్శలు ఉన్నా సరే.. జనాల్లో క్రేజ్ తోపాటు, పార్టీకి ఉపయోగపడతారు అనుకున్న వాళ్ళని కచ్చితంగా తమ పార్టీలోకి ఆహ్వానిస్తామని నచ్చజెబుతున్నారు. సీనియర్లు తమ పార్టీలో చేరినంత మాత్రాన యువనాయకత్వంపై ఎక్కడా చిన్నచూపు ఉండదని భరోసా ఇస్తున్నారు. మరోవైపు బిఆర్ఎస్ అధికారంలో లేకపోయినా, ఎలాంటి లాభాపేక్ష లేకుండానే నేతలు తమ పార్టీలో చేరడానికి వస్తున్నారని అంటున్నారు. ఈ సమయంలో పార్టీలో చేరుతున్న జీవన్ రెడ్డి లాంటి నేతలను వ్యతిరేకించిన ఒకరిద్దరూ యువ నేతలను ఒప్పించేందుకు ట్రై చేస్తున్నారు. ఈ సమయంలో పార్టీ నేతలతో పాటు ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులు కూడా తమ భవిష్యత్తుపై పార్టీ దగ్గర మొరపెట్టుకున్నట్టుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు వచ్చినంత మాత్రాన యువ ఎమ్మెల్యేలకు కానీ, నేతలకు కానీ ఎలాంటి పోటీ కాదని బిఆర్ఎస్ నేతలు ఊరడించే మాటలు చెబుతున్నారు.పార్టీలోకి వచ్చిన వాళ్లను తక్కువ చేసి చూడకుండా, ఆల్రెడీ వున్న వాళ్ల ప్రాధాన్యత ఏమాత్రం తగ్గించకుండా చూసే బాధ్యత తమది అంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ పెద్దలు. చూడాలి భవిష్యత్తులో యువ నేతలకు వృద్ధ నేతలు పోటీ అవ్వబోతున్నారా.. లేక పార్టీలో అందరితోపాటు తమ కూడా అవకాశాలు వస్తాయని యువనాయకత్వం సర్దుకుని పోతుందో కాలమే సమాధానం చెప్పాలంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

# అగాధమంత అసమానత..

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలు అగ్రవర్ణాల కంటే మూడు రెట్లు ఎక్కువ వెనుకబడి ఉన్నారని నివేదిక వెల్లడించింది. బీసీలు కూడా అగ్రవర్ణాల కంటే 2.7 రెట్లు వెనుకబడి ఉన్నారు. మొత్తం 242 కులాల్లో 135 కులాలను 'అత్యంత వెనుకబడినవి'గా గుర్తించారు. ఈ 135 కులాల్లోనే రాష్ట్ర జనాభాలో 67 శాతం మంది ఉన్నారు. ఈ కులాలు రాష్ట్ర సగటు కంటే ఎక్కువ వెనుకబడి ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం, ఎస్సీల్లో 97 శాతం, బీసీల్లో 71 శాతం మంది ప్రజలు రాష్ట్ర సగటు కంటే వెనుకబడి ఉండటం ఆందోళన కలిగించే అంశం. మరోవైపు, అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలూ రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలోనే ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ స్పష్టం చేశాయి. 2024లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాల్లో ఈ విషయం స్పష్టం చేసింది. దీనిపై స్టడీ చేసిన నిపుణుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. నిపుణుల బృందం సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ ఉపాధి వంటి ఐదు కీలక రంగాల్లో ఆయా కులాల స్థితిగతులను నిశితంగా విశ్లేషించింది. ఒక కులానికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న ప్రాతినిధ్యం, భూమి, ఆస్తుల యాజమాన్యం, ఉన్నత విద్యావంతుల శాతం, తలసరి ఆదాయం రాజకీయ పదవుల్లో వారి వాటా వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఈ మార్కులను కేటాయించారు. ఈ సూచీలో స్కోరు ఎంత ఎక్కువగా ఉంటే ఆ కులం అంతటి తీవ్రమైన వెనుకబాటుతనంలో మగ్గుతున్నట్లు లెక్క. ఉదాహరణకు దక్కలి (116), పిచ్చిగుంట్ల (110), సింధోళ్లు (112) వంటి కులాలకు అత్యధిక స్కోరు రావడం వారు అన్ని రంగాల్లో అట్టడుగున ఉన్నారనే చేదు నిజాన్ని వెల్లడిస్తున్నది. మరోవైపు ఓసీ వర్గాలైన రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు 12 నుంచి 30 లోపు స్కోరు రావడమనేది వారి సామాజిక ఉన్నతిని అభివృద్ధిని సూచిస్తోంది.

### దినసరి కూలీలుగానే అట్టడుగు వర్గాలు

ఉపాధి రంగంలో కుల వ్యవస్థ ప్రభావం ఇంకా బలంగా ఉందని సర్వే నివేదిక పేర్కొంది. ఎస్సీ వర్గాల్లో దాదాపు సగం మంది (45.7%) దినసరి కూలీలుగానే జీవితం వెళ్లదీస్తుండగా, అగ్రవర్ణాల్లో ఈ శాతం కేవలం 10.9 మాత్రమే. అలాగే వ్యవసాయ కూలీలుగా ఎస్టీలు 32.2 శాతం, ఎస్సీలు 31.7 శాతం మంది పనిచేస్తుంటే, అగ్రవర్ణాల వారు కేవలం 5.5 శాతం మంది మాత్రమే ఆ రంగంలో ఉన్నారు. దీనికి భిన్నంగా, ప్రైవేటు రంగంలో ప్రొఫెషనల్ ఉద్యోగాల్లో అగ్రవర్ణాల వారు 14.8 శాతంతో పైచేయి సాధించగా, ఎస్టీలు కేవలం 2.8 శాతంతో అట్టడుగున ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీల ప్రాతినిధ్యం రిజర్వేషన్ల వల్ల కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, ప్రైవేటు రంగంలో మాత్రం వెనుకబాటు కొనసాగుతోంది.

### ఎస్టీలకు భూమి ఉన్నా సాగునీరు నిరాశే

భూమి యాజమాన్యం విషయంలో ఒక ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఎస్టీల్లో 58.1 శాతం మందికి భూమి ఉన్నప్పటికీ, అది ఎక్కువగా మెట్ట భూమి కావడంతో వారి ఆదాయం పెరగడం లేదు. అగ్రవర్ణాలకు కేవలం 33.7 శాతం మందికే భూమి ఉన్నా, పెద్ద కమతాలు (౧20 ఎకరాలు) వారి వద్దే ఎక్కువగా ఉన్నాయి. 20 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న కుటుంబాల్లో అగ్రవర్ణాల వారు 4.4 శాతం ఉంటే, ఎస్సీలు కేవలం 1 శాతం ఉన్నారు. సాగునీటి సౌకర్యం ఉన్న భూమి బీసీల వద్ద (45.9%) కొంత ఎక్కువగా ఉన్నప్పటికీ, ఎస్సీ, ఎస్టీల వద్ద భూమి తక్కువగా ఉండటంతో వారు కూలీలుగానే మిగిలిపోతున్నారు.

### సౌకర్యాల లేమిలో గిరిజన ప్రాంతాలు

మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం ఇంకా చాలా దూరం ప్రయాణించాలని సర్వే గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్ర సగటున 13.3 శాతం కుటుంబాలకు మరుగుదొడ్లు లేవు, కానీ ఎస్టీలలో ఈ శాతం ఏకంగా 32.5గా ఉండటం గమనార్హం. అలాగే విద్యుత్ సౌకర్యం లేని కుటుంబాల్లో ఎస్టీలే అత్యధికంగా (11%) ఉన్నారు. నల్లా నీటి సౌకర్యం లేని ఇళ్లు ఎస్టీల్లో 29.2 శాతంగా ఉండగా, అగ్రవర్ణాల్లో ఇది కేవలం 12.8 శాతమే. రెండు లేదా అంతకంటే తక్కువ గదులున్న చిన్న ఇళ్లలో 75.5 శాతం మంది ఎస్టీలు నివసిస్తుండటం వారి జీవన ప్రమాణాలు దయనీయస్థితికి అద్దం పడుతున్నాయి. ఆధునిక విలాస వస్తువులైన కార్లు, ఫ్రిడ్జ్‌ల వినియోగంలో అగ్రవర్ణాలే అగ్రస్థానంలో ఉన్నాయి.

### ఎవరికి ఎంత దక్కుతోంది?

రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కేటాయించే మొత్తంలో 30 శాతం నిధులు రాష్ట్ర సగటు కంటే తక్కువ వెనుకబాటుతనం ఉన్న (సంపన్న) కులాలకే చేరుతున్నాయని నివేదిక సంచలన వ్యాఖ్య చేసింది. వ్యవసాయ ఆధారిత పథకాలైన రైతు భరోసా, ఉచిత విద్యుత్ వంటి వాటిలో భూమి ఎక్కువగా ఉన్న అగ్రవర్ణాలే ఎక్కువ ప్రయోజనం పొందుతున్నారు. ఉదాహరణకు రైతు భరోసా లబ్ధిదారుల్లో అగ్రవర్ణాల వారు 15 శాతం ఉంటే, ఎస్సీలు కేవలం 12 శాతం మాత్రమే ఉన్నారు. అయితే ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల్లో ఎస్సీ మహిళలు (20%) అధికంగా లబ్ధి పొందుతున్నారు. సంక్షేమ పథకాలు నిజమైన వెనుకబడిన వర్గాలకు చేరాలంటే విధివిధానాల్లో మార్పులు రావాలని నివేదిక సూచించింది.

### మహిళల విద్యలో వెనుకబాటు

మహిళల స్థితిగతులపైనా ఈ నివేదిక కీలక అం శాలను వెల్లడించింది. రాష్ట్రంలో 65.5 % మంది మహిళలు పదో తరగతి కూడా దాటలేదు. ఎస్టీ మహి ళల్లో ఈ వెనుకబాటుతనం 72.3 శాతంగా ఉండటం శోచనీయం. బాల్య వివాహాల విషయంలో కూడా ఆందో ళనకర పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో దాదాపు 2.16 లక్షల మంది బాలికలకు 18 ఏళ్లలోపే పెళ్లవుతోంది. విచిత్రంగా అగ్రవర్ణాలైన అయ్యంగార్లు/అయ్యర్లలో ఈ శాతం ఎక్కువగా (21.2%) ఉండటం నిపుణులను ఆశ్చర్యపరిచింది. లింగ నిష్పత్తి ఎస్సీల్లో మెరుగ్గా (101.0%) ఉండగా, అగ్రవర్ణాల్లో (97.6%) తక్కువగా ఉంది.

### కులవృత్తులను వదిలేసిన్రు

తెలంగాణలో కుల వృత్తులపై ఆధారపడటం క్రమంగా తగ్గుతున్నట్లు సర్వే స్పష్టం చేసింది. సుమారు 69.6 శాతం మంది తమ సంప్రదాయ కుల వృత్తులను వదులుకుని ఇతర రంగాల్లోకి మారారు. కేవలం 30.4 శాతం మంది మాత్రమే ఇంకా కుల వృత్తులపైనే ఆధారపడుతున్నారు. కుల వృత్తులను వదులుకున్న వారిలో అగ్రవర్ణాల వారు 85.6 శాతంతో ముందుండగా, బీసీలు 61.3 శాతం మంది ఉన్నారు. ఎస్సీల్లో 71.4 శాతం, ఎస్టీల్లో 87 శాతం మంది కుల వృత్తులను వీడి దినసరి కూలీలుగా లేదా ఇతర పనుల్లో స్థిరపడ్డారు.ముఖ్యంగా పట్టణీకరణ వల్ల యువత కుల వృత్తుల పట్ల ఆసక్తి చూపడం లేదు. కుల వృత్తులను ఇంకా కొనసాగిస్తున్న వారిలో బీసీ వర్గాలు 38.7 శాతంతో మెజారిటీగా ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కుల వృత్తుల ప్రభావం దాదాపు 81.5 శాతం మేర తగ్గింది. ఈ ధోరణి సామాజిక గమనశీలతను ఆర్థిక మార్పులను సూచిస్తోంది. సాంప్రదాయ వృత్తుల నుంచి ఆధునిక వృత్తుల వైపు మళ్లుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది.ఉపాధి కోసం మహారాష్ట్ర, కర్నాటకకు బతుకుదెరువు కోసం తెలంగాణ నుంచి వలసలు వెళ్లే వారి శాతం 1.1గా ఉంది. ఇలా వలస వెళ్లిన వారిలో 60.4 శాతం మంది ఇతర దేశాలకు వెళ్లగా, 39.6 శాతం మంది ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. విదేశాలకు వెళ్లిన వారిలో 42 శాతం మంది గల్ఫ్ దేశాలకే వెళ్లడం గమనార్హం. అమెరికాకు వెళ్లిన వారి వాటా 17.8 శాతంగా ఉంది. బ్రిటన్ కు 14.5 శాతం మంది, ఆస్ట్రేలియాకు 2.6 శాతం మంది వెళ్లారు. యూరప్ దేశాలకు 7.6 శాతం మంది ఉపాధి కోసం వెళ్లారు. వలసలు ఎక్కువగా జగిత్యాల (3.8%) నిజామాబాద్ (2.5%) జిల్లాల నుంచి ఉన్నాయి. గల్ఫ్ వలసల్లో బీసీ వర్గాల వాటా 52.6 శాతం కాగా, ఎస్సీల వాటా 61.1 శాతంగా ఉంది. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే వారిలో అగ్రవర్ణాల వారు 37.6 శాతంతో ముందున్నారు. ఈ డేటా ప్రకారం ఉత్తర తెలంగాణ నుంచి వలసలు ఇంకా కొనసాగుతున్నాయి. పేదరికం నిరుద్యోగం వలసలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.ప్రజలు వలస వెళ్లడానికి ప్రధాన కారణం ఉద్యోగం/ఉపాధి అని సర్వే వెల్లడించింది. సుమారు 29.1 శాతం మంది ఉపాధి కోసమే వలస వెళ్లగా, 20.5 శాతం మంది ఉన్నత చదువుల కోసం వెళ్లారు. వ్యాపారాల నిమిత్తం 3.1 శాతం మంది వలస బాట పట్టారు. చదువు కోసం విదేశాలకు వెళ్లే వారిలో అమెరికా (17.8%) బ్రిటన్ (14.5%) ప్రధాన గమ్యస్థానాలుగా ఉన్నాయి. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లే వారిలో మహారాష్ట్ర, కర్నాటక వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. విదేశీ ప్రయాణాలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలలో 30 శాతం మంది ఉపాధి కోసమే వెళ్తున్నారు. అగ్రవర్ణాలలో చదువు కోసం వెళ్లే వారి శాతం 43.8గా ఉండటం గమనార్హం. పట్టణ ప్రాంత యువత ఎక్కువగా ఉన్నత చదువుల కోసం, గ్రామీణ యువత ఉపాధి కోసం వలస వెళ్తున్నారు. ఈ గణాంకాలు రాష్ట్రంలోని ఉపాధి కల్పన విద్యా వసతుల స్థాయిని సూచిస్తున్నాయి. వలస కార్మికుల సంరక్షణ కోసం ప్రత్యేక విధానాల అవసరమని ఈ నివేదిక వెల్లడించింది.

### అగ్రవర్ణాల్లో ప్రైవేటు చదువులు.. ఎస్సీ ఎస్టీలు సర్కార్ బడులకే..

విద్యారంగంలో సామాజిక వర్గాల మధ్య భారీ వ్యత్యాసాలు ఉన్నాయని నివేదిక ఎత్తిచూపింది. అగ్రవర్ణాలకు చెందిన పిల్లల్లో 34 శాతం మంది ప్రైవేటు పాఠశాలల్లో చదువుతుండగా, ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మందికి మాత్రమే ఈ అవకాశం దక్కుతోంది. ఉన్నత విద్య (డిప్లొమా అంతకంటే ఎక్కువ) సాధించిన వారిలో అగ్రవర్ణాల వారు 57 శాతంతో ముందుండగా, ఎస్టీలు కేవలం 31 శాతంతో వెనుకబడి ఉన్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యలోనూ అగ్రవర్ణాల యువత 66 శాతంతో దూసుకుపోతుండగా, ఎస్టీ యువత 36 శాతానికే పరిమితమైంది. ఈ విద్యా అసమానతలే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వెనుకబాటుకు పునాది వేస్తున్నాయి.

### రూ. లక్షలోపే 78.2 శాతం కుటుంబాల ఆదాయం

తెలంగాణలోని 78.2 శాతం కుటుంబాల వార్షిక ఆదాయం లక్ష కంటే తక్కువగానే ఉందని నివేదిక విస్తుపోయే నిజం చెప్పింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే, ఎస్టీల్లో 88.2 శాతం, ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు ఈ పేదరికపు కోరల్లోనే చిక్కు కుని ఉన్నాయి. అదే సమయంలో అగ్రవర్ణాల్లో దాదాపు సగం మంది అంటే 43.8 శాతం కుటుం బాలు లక్ష కంటే ఎక్కువ ఆదాయం కలిగి ఉన్నా యి. రూ. 5 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉన్న వారిలో అగ్రవర్ణాల వారు 13.2 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారు. ఇన్‌కమ్ టాక్స్ కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణాల వారే కావడం ఆర్థిక కేంద్రీకరణను సూచిస్తోంది.

### వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్న పేదలు

ఆర్థిక అత్యవసరాల కోసం పేద వర్గాలు ఇంకా ప్రైవే టు వడ్డీ వ్యాపారుల పైనే ఆధారపడుతున్నారని నివేదిక స్పష్టం చేసింది. ఎస్టీల్లో 9.7 శాతం, ఎస్సీల్లో 8.8 శాతం కుటుంబాలు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకున్నాయి. అగ్రవర్ణాల్లో ఈ శాతం కేవలం 5.1 మాత్రమే. ముఖ్యంగా వివాహాలు, ఆరోగ్య సమస్యల కోసం తీసుకునే రుణాల్లో ఎస్సీలు (10.9%) అగ్రస్థానంలో ఉన్నారు. సంస్థాగత పరపతి (బ్యాంకులు) అందకపోవడం, పొదుపు లేకపోవడం వల్ల ఈ వర్గాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. వైద్య ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి రావడం ప్రజారోగ్యంపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది

# దేశంలో ఇక నక్సల్ జిల్లాలు జీరో

భారత దేశంలో నక్సల్ ప్రభావిత జిల్లా లేదని కేంద్ర ప్రభుత్వం తొలిసారి అధికారికంగా ప్రకటించింది. దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లా ఒక్కటి కూడా లేదని రాష్ట్రాలకు ఇచ్చిన సమాచారంలో కేంద్రం వెల్లడించింది. నేషనల్ పాలసీ, యాక్షన్ ప్లాన్ కింద ఉన్నతస్థాయి సెక్యూరిటీ సమీక్ష జరిగింది. ఆ తర్వాత తొమ్మిది రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లకు ఒక అధికారిక సందేశాన్ని పంపింది. మార్చి 27వ తేదీన నక్సల్ ప్రభావిత జిల్లాలుగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌బమ్ జిల్లాలున్నట్టు కేంద్రం నోటిఫై చేసింది. తాజాగా, ఏప్రిల్ 8న రాష్ట్రాలకు పంపిన సందేశంలో ఒక్క జిల్లా కూడా నక్సల్ ప్రభావితంగా లేదని స్పష్టం చేసింది. అయితే, ఈ తొమ్మిది రాష్ట్రాల్లో 37 జిల్లాలను లెగసీ, థ్రస్ట్ జిల్లాలుగా, ఒక కన్సర్న్ జిల్లాగా సూచించింది. ఈ జిల్లాల్లో నక్సల్స్ ప్రభావం లేదని, వారి కదలికలే లేవని, కానీ, మళ్లీ ఆ సవాల్ పునరుద్ధరణ చెందకుండా సెక్యూరిటీ మోహరింపు కొంతకాలం కొనసాగుతుందని వివరించింది. మన దేశం నుంచి నక్సలిజాన్ని అంతం చేస్తామని, అందుకు మార్చి 31వ తేదీని కేంద్రం డెడ్‌లైన్‌గా విధించింది. మార్చి 31వ తేదీన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో మాట్లాడుతూ.. దేశంలో దాదాపుగా నక్సలిజం అంతమైందని స్పష్టం చేశారు. ఈ డెడ్‌లైన్ ముగిసిన తర్వాత హైలెవెల్ సెక్యూరిటీ సమీక్ష చేపట్టారు. ఆ తర్వాతే దేశంలో నక్సల్ ప్రభావిత జిల్లా లేదని రాష్ట్రాలకు సమాచారమిచ్చినట్టు అధికారులు పీటీఐ ఏజెన్సీకి వెల్లడించారు.

### జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్.. టార్గెట్ మిసిర్ బెస్రా?

జార్ఖండ్ సరండా జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత మిసిర బెస్రా ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు. సరండా సమీపంలోని అడవుల్లో బెస్రా, ఆయన టీం ఉన్నట్టు బలగాలకు సమాచారం అందడంతో ఆపరేషన్ చేపట్టినట్టు తెలిసింది. ఆ ఏరియాకు వెళ్లగానే మావోయిస్టులు తమపై కాల్పులు జరపగా.. ప్రతిదాడులు చేసినట్టు భద్రతావర్గాలు వివరించాయి. కొన్ని గంటలపాటు సుదీర్ఘంగా కాల్పులు జరిగి.. ఆ తర్వాత ఆగిపోయాయని జార్ఖండ్ పోలీసు ప్రతినిధి, ఐజీ మైఖేల్ రాజ్ వెల్లడించారు. ఈ కాల్పుల్లో ఐదుగురు కోబ్రా జవాన్లకు గాయాలయ్యాయని, అయితే వారి ప్రాణాలకు ప్రమాదమేమీ లేదని తెలిపారు. ఈ కాల్పుల్లో సుమారు నలుగు మావోయిస్టులు మరణించినట్టు అనుమానిస్తున్నారు. ఎన్‌కౌంటర్ ముగిసిందని, సెర్చ్ చేస్తున్నట్టు అధికారులు వివరించారు.

### ఛత్తీస్‌గఢ్ కొత్త ఫేజ్ ఆపరేషన్

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, రాజ్‌నంద్‌గావ్‌లో భద్రతా బలగాలు కొత్త దశ ఆపరేషన్ ప్రారంభించారు. బలగాలు ఈ ఆపరేషన్‌లో ఎన్‌కౌంటర్లు, మావోయిస్టుల అరెస్టుల లక్ష్యంగా పెట్టుకోలేదు. భద్రతా బలగాలు లక్ష్యంగా గతంలో పాతిపెట్టిన మందుపాతరలు, ఐఈడీలను గుర్తించి వెలికి తీయడానికి, నక్సలైట్లు ఆయుధ డంప్, బంగారం, నగదును స్వాధీనం చేసుకోవడానికి ఈ ఆపరేషన్ చేపట్టినట్టు తెలిసింది. ఇది వరకే లొంగిపోయిన మావోయిస్టుల నుంచి సమాచారాన్ని సేకరించి ఈ పని



మొదలుపెట్టినట్టు చెబుతున్నారు. భవిష్యత్‌లో ఈ ఏరియాలో సామాన్యులు సురక్షితంగా, ప్రాణాలకు ప్రమాదం లేకుండా జీవించాలని, అందుకే తాము అన్వేషణ మొదలుపెట్టినట్టు భద్రతావర్గాలు వివరించాయి. కాగా, కొన్ని వివరాలు మరణించిన నక్సలైట్ నాయకులతో సమాధి అయినట్టూ చెప్పారు.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఐదేళ్లయినా ఏర్పాటు కాని కౌన్సిల్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వైద్య సేవల్లో డాక్టర్లు, నర్సులతో సమానంగా సేవలందించే 57 రకాల అనుబంధ వైద్య వృత్తుల(అలైడ్ హెల్త్ ప్రొఫెషన్స్) భవిష్యత్తు తెలంగాణలో అగమ్యగోచరంగా మారింది. వీరిని ఒకే గొడుగు కిందకు తెస్తూ కేంద్ర ప్రభుత్వం 2021 మార్చిలో నేషనల్ కమిషన్ ఫర్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రతి రాష్ట్రం వెంటనే స్థానిక కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దేశవ్యాప్తంగా అలైడ్ హెల్త్ కేర్ కౌన్సిల్స్ ఏర్పాటులో మెజారిటీ రాష్ట్రాలు ముందడుగు వేయగా.. తెలంగాణలో మాత్రం ఆ దిశగా అడుగులు పడటం లేదు. వైద్య రంగంలో కీలక భూమిక పోషిస్తున్న అనుబంధ వృత్తుల నిపుణుల పట్ల రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వం చట్టం చేసి ఐదేళ్లు గడుస్తున్నా.. సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా రాష్ట్రంలో కౌన్సిల్ ఏర్పాటు కాకపోవడంపై నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతర్..**

దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలు ఇప్పటికే రాష్ట్ర స్థాయి కౌన్సిల్లను ఏర్పాటు చేసుకున్నాయి. మన రాష్ట్రంలో మినహా దక్షిణాదిలోనూ అన్ని రాష్ట్రాల్లో కౌన్సిల్స్ ఏర్పాటయ్యాయి. తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాలు మాత్రమే ఈ ప్రక్రియలో వెనుకబడి ఉన్నాయి. దీనిపై గతంలోనే కేంద్ర ప్రభుత్వం పలుమార్లు రాష్ట్రాలను ఆదేశించింది. చివరకు సుప్రీంకోర్టు సైతం రాష్ట్ర కౌన్సిల్లను తక్షణమే ఏర్పాటు చేయాలని కఠిన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో కదలిక రాకపోవడం గమనార్హం. గత ప్రభుత్వం కౌన్సిల్ ఏర్పాటులో విఫలమైందని, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదని వైద్య అనుబంధ వృత్తుల జాయింట్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర నాయుడు విమర్శించారు. జాతీయ కమిషన్ ఏర్పడి ఐదేళ్లు గడిచినా, రాష్ట్రంలో కౌన్సిల్ లేకపోవడంతో నిపుణులు తీవ్ర నిరాశా నిస్పృహల్లో ఉన్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల రవిందర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కౌన్సిల్ ఆవశ్యకతను వివరిస్తూ జాయింట్ ఫోరమ్ ప్రతినిధులు ఇప్పటికే అకడమిక్ వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ శివరాం ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కౌన్సిల్ ఏర్పాటుతో 57 రకాల వైద్య అనుబంధ వృత్తులకు చట్టబద్ధత లభిస్తుందని కేంద్ర వైద్య అనుబంధ వృత్తి నిపుణుల కమిషన్ అధ్యక్షుడు, నిమ్స్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సిరందాస్ శ్రీనివాసులు తెలిపారు. నిపుణుల రిజిస్ట్రేషన్, సర్టిఫికేషన్ ప్రక్రియ క్రమబద్ధీకరించబడుతుందని ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఇకనైనా స్పందించి, లక్షలాది మంది అలైడ్ హెల్త్ ప్రొఫెషనల్స్ ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే రాష్ట్ర కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని జాయింట్ ఫోరమ్ డిమాండ్ చేస్తోంది.

**అలైడ్ హెల్త్ నిపుణులు లేకుంటే వైద్యం పూర్తి కాదు**

మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ, రేడియోలజీ, ఇమేజింగ్ టెక్నాలజీ(సీటీ, ఎంఆర్ఐ, ఎక్స్ రే), ఆప్టోమెట్రీ(కంటి వైద్యం), ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ, కార్డియోవాస్క్యులర్ టెక్నాలజీ, డయాలసిస్ టెక్నాలజీ, ఓటీ టెక్నాలజీ, అనస్థీషియా టెక్నాలజీ, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ, మెడికల్ రికార్డ్స్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్, క్లినికల్ న్యూట్రిషన్(డైటీషియన్లు) తదితర 57 రకాల అనుబంధ వైద్య వృత్తులు తమకు అలైడ్ హెల్త్ కౌన్సిల్ ఏర్పాటు కోసం డిమాండ్ చేస్తున్నాయి. వైద్య చికిత్సలో డాక్టర్లు వ్యాధిని నిర్ధారించాలన్నా, చికిత్స అందించాలన్నా ఈ అలైడ్ హెల్త్ నిపుణుల సేవలు అత్యంత కీలకం. రోగికి రక్త పరీక్షలు చేసే ల్యాబ్ టెక్నీషియన్ నుంచి, శస్త్రచికిత్స సమయంలో కీలకమైన ఓటీ టెక్నీషియన్ వరకు ప్రతి ఒక్కరూ ప్రాణరక్షణలో భాగస్వాములే. వీరు లేనిదే ఆధునిక వైద్యం పూర్తికాదు. అయితే, వీరికి కౌన్సిల్ లేకపోవడంతో వీరి సేవలకు సరైన గుర్తింపు, హోదా లభించడం లేదు.

**కౌన్సిల్ ఏర్పాటు చేయాల్సిందే..**

కౌన్సిల్ గుర్తింపు లేని కోర్సులు చదవడం వల్ల విద్యార్థులు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. రాష్ట్ర కౌన్సిల్ లేకపోతే ఇతర రాష్ట్రాలు లేదా దేశాలకు వెళ్లినప్పుడు వెరిఫికేషన్ ప్రక్రియ లో ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రైవేటు కాలేజీలు ఇష్టానుసారంగా కోర్సులు నడిపిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే ప్రమాదం ఉంది. సరైన శిక్షణ లేనివారు ఈ వృత్తిలోకి ప్రవేశిస్తే రోగుల ప్రాణాలకు ముప్పు కలిగే ప్రమాదం ఉంది. కౌన్సిల్ ఏర్పాటుతో అలైడ్ హెల్త్ వృత్తులకు అధికారిక గుర్తింపు లభిస్తుంది. చదివిన కోర్సులకు అనుగుణంగా లైసెన్సులు లభిస్తాయి, తద్వారా విదేశీ ఉద్యోగాలకు మార్గం సుగమం అవుతుంది. విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, బోధన ప్రమాణాలను కౌన్సిల్ పర్యవేక్షిస్తుంది. అనర్హులు, నకిలీ సర్టిఫికెట్లతో ప్రాక్టీస్ చేసే వారికి అడ్డుకట్ట పడుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో సమాన పనికి సమాన వేతనం పొందే అవకాశం ఉంటుంది. కౌన్సిల్ ఏర్పాటుతో వైద్య సేవల్లో నాణ్యత పెరగడంతో పాటు అనధికార ప్రాక్టీషనర్లకు అడ్డుకట్ట పడుతుందని, ఉపాధి అవకాశాల్లో పారదర్శకత పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండ నాగరాజు పేర్కొన్నారు.

# అవినీతికి అడ్డాగా హుజూరాబాద్ మున్సిపాలిటీ..




**హుజూరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అవినీతికి అడ్డాగా హుజూరాబాద్ మున్సిపాలిటీ మారుతోంది. పాలకులు మారుతున్నా, వ్యవస్థ అప్గ్రేడ్ అవుతున్నా.. కొందరు అధికారుల తీరు మాత్రం మారడం లేదు. తాజాగా మున్సిపల్ ఏఈ సుధాకర్ రెడ్డి ఏసీబీకి చిక్కడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మేజర్ గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీ వరకు హుజూరాబాద్ ప్రస్థానంలో అవినీతి తిమింగలాలు అంచెలంచెలుగా ఎదుగుతూనే ఉన్నాయి.

**ముచ్చటగా మూడోసారి.. అదే సీన్!**

హుజూరాబాద్ మున్సిపల్ చరిత్రలో ఏసీబీ దాడులు జరగడం ఇది మూడోసారి. గతంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో అప్పటి ఈవో అశోక్ రెడ్డి ఏసీబీకి పట్టుబడగా, ఆ తర్వాత 2012లో తొలి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దేవేందర్ సైతం కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ దొరికిపోయారు. ఇప్పుడు ఏఈ సుధాకర్ రెడ్డి వంతు రావడంతో, ఇక్కడ అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో అర్థమవుతోంది.

**పాలకుల అండ.. అధికారుల దందా..**

ప్రజలకు సేవ చేస్తామని ప్రమాణాలు చేసి గెలిచిన కొందరు ప్రజాప్రతినిధులు, తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికారులను లొంగదీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ మాట వినని అధికారులను లంచం ఎరవేసి ఏసీబీకి పట్టించడం లేదా, తమకు సహకరించే వారిని అవినీతి ఊబిలోకి లాగడం ఇక్కడ పరిపాటిగా మారింది. నిన్నటి వరకు సైకిల్ మీద తిరిగిన కొందరు నాటి వార్డు మెంబర్లు నేడు నాయకులుగా ఎదిగి కోట్లాది రూపాయల ఆస్తులు, భూములు కూడగట్టడం చూస్తుంటే ప్రజాధనం ఏ మేరకు కొల్లగొట్టబడుతుందో స్పష్టమవుతోంది.

**అటెండర్ నుంచి ఆఫీసర్ వరకు.. ఇక్కడే తిష్ట**

హుజూరాబాద్ మున్సిపాలిటీలో మరో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. మేజర్ గ్రామ పంచాయతీ కాలం నుంచి నేటి వరకు కొందరు సిబ్బంది అటెండర్ స్థాయి నుంచి ఆఫీసర్ స్థాయికి ఎదిగినా ఇక్కడే పాతుకుపోయారు. బదిలీలు అయినా వెళ్లకుండా, మళ్లీ ఇక్కడికే పోస్టింగులు తెప్పించుకుంటూ కొందరు సిబ్బంది మున్సిపాలిటీని తమ సొంత సామ్రాజ్యంగా మార్చుకున్నారు.

**ఈ సెక్షన్‌లో కీలకం..**

మున్సిపాలిటీలో నిధుల లావాదేవీలు జరిగే అకౌంట్ సెక్షన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్,శానిటేషన్, రెవెన్యూ సెక్షన్లు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఈ సెక్షన్లలో పనిచేసే కొందరు అధికారులు చేయి తడపందే పనులు చేయడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక్కడ ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు కీలక సమాచారాన్ని బయటి వ్యక్తులకు చేరవేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెగ్యులర్ అధికారులు బదిలీపై వచ్చినా, సదరు కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రం తన సీటు వదలకుండా చక్రం తిప్పుతుండటం గమనార్హం.


**వెనకబడ్డ అభివృద్ధి.. వెలుగుతున్న నేతలు!**

1962లోనే మున్సిపాలిటీ హోదా ఉన్న హుజూరాబాద్‌ను లోటు బడ్జెట్ సాకుతో వెనక్కి నెట్టిన చరిత్ర ఇక్కడి పాలకులది. అభివృద్ధిలో వెనుకబడిన, అవినీతిలో మాత్రం హుజూరాబాద్ మున్సిపాలిటీ 'టాప్' లో నిలుస్తోంది. సామాన్య మానవుడి గోడు వినే నాథుడు లేక, కనీస సౌకర్యాలు కరువై ప్రజలు తల్లడిల్లుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హుజరాబాద్ మున్సిపాలిటీలో వేళ్లూనుకున్న అవినీతి నెట్‌వర్క్‌ను తుదముట్టించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ వాటా తగ్గితే భారీ ఉద్యమం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో సభ ముందుకు కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులను తీసుకొస్తుంది. ఈ బిల్లులపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెంచే ప్రక్రియలో తెలంగాణ రాజకీయ ప్రాతినిధ్యం తగ్గితే సహించేది లేదని, తెలంగాణ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు రోడ్లపైకి వస్తారని ఆమె హెచ్చరించారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణ ప్రాతినిధ్యం 3.13 శాతంగా ఉందని, ఇది అత్యంత కనిష్ట స్థాయి అని కవిత పేర్కొన్నారు. "పునర్విభజన తర్వాత కూడా పార్లమెంట్‌లో తెలంగాణకు కనీసం 3.13 శాతం ప్రాతినిధ్యం ఉండాలి. దీనిని మా రాష్ట్రానికి బేస్‌లైన్ (కనిష్ట స్థాయి) గా పరిగణించాలి. అంతకంటే ఒక్క శాతం తగ్గినా తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లే" అని ఆమె స్పష్టం చేశారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న 50 శాతం సీట్ల పెరుగుదల పైకి సానుకూలంగా కనిపిస్తున్నా, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు వచ్చే సీట్ల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉందని, ఇది ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కవిత తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో కాకుండా, ఓబీసీ రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టాలి. 33 శాతం రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు తగిన వాటా (కోటాలో కోటా) కల్పిస్తేనే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుంది" అని డిమాండ్ చేశారు. జనాభా నియంత్రణ, అభివృద్ధిలో ముందంజలో ఉన్న దక్షిణాది రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో శిక్షించడం ప్రజాస్వామ్య విరుద్ధమని, దీనిపై పార్లమెంట్ నుంచి వీధుల వరకు పోరాటం చేస్తామని కవిత ప్రకటించారు

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ తనిఖీలు..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వేదికగా జరుగుతున్న అక్రమ కరెన్సీ రవాణాకు కస్టమ్స్ అధికారులు మరోసారి బ్రేక్ వేశారు. హాంకాంగ్‌కు అక్రమంగా విదేశీ కరెన్సీ ని తరలిస్తున్న ఓ ప్రయాణికుడిని అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి హాంకాంగ్ కు వెళ్లేందుకు సిద్ధమైన ఓ ప్రయాణికుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు, అతడి లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సదరు ప్రయాణికుడి వద్ద ఎటువంటి అనుమతులు లేని సుమారు రూ.45 లక్షల విలువైన విదేశీ కరెన్సీని అధికారులు గుర్తించారు. బ్యాగుల్లో అత్యంత చాకచక్యంగా దాచి తరలించే ప్రయత్నం చేసినట్లుగా సమాచారం. పట్టుబడిన నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, విదేశీ కరెన్సీ నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేశారు. అంత భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు..? దీని వెనుక ఏదైనా హవాలా ముఠా ఉందా? అనే కోణంలో అధికారులు సదరు ప్రయాణికుడిని విచారిస్తున్నారు



# చట్టసభల్లో మహిళా గర్జన

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్స్ కల్పించేందుకు కేంద్రం సిద్ధమైంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మహిళలకు రిజర్వేషన్లు వర్తించనున్నాయని రాష్ట్రంలోని స్త్రీలు లెక్కలు వేసుకుంటున్నారు. మొత్తంగా 60 వరకు ఎమ్మెల్యే సీట్లు మహిళలకు రిజర్వ్ కానున్నాయని అధికారులు లెక్కలు వేసి చెబుతున్నారు. దీంతో చట్టసభల్లో తమకు ప్రాతినిధ్యం లభించనుందని నారీమణులు ఆశల పల్లకిలో తేలుతున్నారు. ఎమ్మెల్యేతో పాటే ఎంపీ స్థానాల్లోనూ వీరికి రిజర్వేషన్ వర్తించనుంది. మహిళా రిజర్వేషన్ అమల్లోకి వస్తుండటంతో ఆర్థికంగా, సామాజికంగా బలమైన వర్గాలు రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. తమకు పోటీ చేసే చాన్స్ రాకపోయినా తమ కుటంబసభ్యులకు చాన్స్ ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరనున్నట్టు తెలుస్తోంది. ఆ జాబితాలో ప్రస్తుత సిట్టింగ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఉన్నారు. వీరంతా తమ భార్య, కోడలు, కూతుళ్లను బరిలోకి దింపేందుకు సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో వీరి గెలుపుకోసం కూతుళ్లు, కోడళ్లతో పాటు నేతల భార్యలు సైతం ప్రచారం చేశారు. అదే అనుభవంతో ఇప్పుడు వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరనున్నట్టు సమాచారం. కొందరు నేతలు గత మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేటర్, కౌన్సిలర్‌గా పోటీ చేయించి చైర్మన్, వైస్ చైర్మన్‌లను చేశారు. మహిళా నేతల విషయంలో కాంగ్రెస్ ముందుంది. ఆ తర్వాత బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఉన్నాయి.

**పార్టీల వారీగా మహిళా నేతలు..**

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి మంత్రి సీతక్క, ఆమె కోడలు కుంజా కుసుమంజలి, మంత్రి కొండా సురేఖ, ఆమె కుతూరు సుస్మిత పటేల్, ఎంపీ కడియం కావ్య, జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, పీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, మహబూబాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు భూక్య పద్మ, రామచంద్ర నాయక్ సతీమణి డాక్టర్‌గా ఇప్పటికే ఆమె ప్రజల్లో ఉన్నారు. మహిళా కాంగ్రెస్‌రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఇందిరా, బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీమంత్రి సత్యవతి రాథోడ్, మాజీ జెడ్పీ చైర్మన్‌నాగవాణి, డాక్టర్ హరిరమాదేవి, గండ్ర జ్యోతి, ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు, పెద్ది స్వప్న, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ కూతురు తేజస్విని, చందుపట్ల కీర్తి రెడ్డి, రావు పద్మ తదితరులున్నారు.

**జిల్లాల వారీగా ఆశావహులు..**

ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలో ఈటల రాజేందర్ సతీమణి, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నేరేళ్ల శారద, బీఆర్ఎస్ నేతలుదావ వసంత, కొప్పుల ఈశ్వర్ కూతురు నందిని, తుల ఉమ, బోగా శ్రవణి, చొప్పదండి బొడిగే శోభ, పుట్ట శైలజ తదితరులు పోటీలో ఉండే అవకాశం ఉందని తెలిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని గత ఎన్నికల్లోనే ఎంపీ టికెట్టు ఆశించారు. సాధ్యం కాలేదు. ఈసారి జిల్లాలో ఎక్కడో ఒక దగ్గర ఆమె ఖచ్చితంగా పోటీ చేయాలనే ఆలోచన ఉన్నట్లుగా తెలిసింది. ఆమెతో పాటుగా మాజీ ఎమ్మెల్యేలు బానోతు చంద్రావతి, బానోతు హరిప్రియ నాయక్, కొత్తగూడెం డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న తదితరులున్నారు. ఉమ్మడి రంగారెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, స్పీకర్ గడ్డం సంపత్ కూతురు మున్సిపల్‌చైర్మన్, పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, కాలే యాదయ్య భార్య, కొడలు, కుటుంబ సభ్యులు ఇప్పటికే ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీకే అరుణ, కూతురు, డీకే సిగ్ధారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తన సతీమణి లేదా పెద్ద కూతురిని రంగంలోకి దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. అచ్చంపేట గువ్వల బాలరాజు సతీమణి రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. మర్రి జనార్ధన్ రెడ్డి సతీమణి ఇప్పటికే సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి సతీమణి గతంలోనే జిల్లా రైతు సమితి అధ్యక్షురాలుగా పనిచేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మంత్రి ఉత్తమ్ భార్య పద్మావతి ఎమ్మెల్యేగా ఉన్నారు. గతంలో ఎమ్మెల్సీగా పోటీ చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి, నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి చైతన్య, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

**నేతల కుటుంబీకులు..**

ఖానాపూర్ నియోజకవర్గం మారకపోతే కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సతీమణి పోటీ చేస్తారని తెలుస్తోంది. బీజేపీ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ కూతురు సోనాలి రాథోడ్, కోడలు, రితిష్ రాథోడ్ సతీమణి సుభాషిని రాథోడ్ ఉండగా.. బీఆర్ఎస్ నుంచి నియోజకవర్గ ఇన్చార్జి జాన్సన్ నాయక్ సతీమణి ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మహిళా రిజర్వేషన్లపై ఆసక్తి మొదలైంది. ప్రస్తుతం ఉన్న ఓటర్ల సంఖ్యను బట్టి కొత్తగా ఏర్పడే నియోజకవర్గాలను లెక్కలోకి తీసుకుంటే ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 10 నియోజకవర్గాలు ఉండగా కొత్తగా ఐదు పెరిగి 15 నియోజకవర్గాలు అవుతాయని భావిస్తున్నారు. ఈ లెక్కన మూడు నుంచి నాలుగు నియోజకవర్గాలు మహిళలకు రిజర్వేషన్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న మహిళల జనాభా ప్రకారం నిర్మల్, ఆదిలాబాద్, ముధోల్, మంచిర్యాల నియోజకవర్గాలు మహిళలకు రిజర్వేషన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిర్మల్లో బీజేపీ నుంచి ఏలేటి మహేశ్వర్ రెడ్డి భార్య ఏలేటి కవితా రెడ్డి, కాంగ్రెస్ నుంచి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీహరి రావు రెండో కూతురు మాధురి, మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కోడలు దివ్య గౌతంరెడ్డి, బీఆర్ఎస్‌నుంచి మాజీ జెడ్పీ చైర్పర్సన్ విజయలక్ష్మి రామ్ కిషన్ రెడ్డిలు పోటీలో ఉండే అవకాశం ఉంది. ముధోల్ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ నుంచి మహిళ నేత పడకండి రమాదేవి, కిరణ్ కొమ్రేవార్ సతీమణి డాక్టర్ చైతన్య, ప్రముఖ వైద్యుడు డాక్టర్ దేవేందర్ రెడ్డి సతీమణి అశ్విని, బీజేపీ నుంచి మాజీ జెడ్పీ చైర్ పర్సన్ శోభా సత్యనారాయణ గౌడ్, (ముధోల్, నిర్మల్ రెండింటి నుంచి ఏదో ఒకటి) మోహన్ రావు పటేల్ సతీమణి అనసూయ పటేల్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రేయ సతీమణి శ్వేత పేర్లు వినిపిస్తున్నాయి. మంచిర్యాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సతీమణి మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పేరు తెరపైకి బలంగా వస్తున్నది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజెపి నుంచి సుహాసిని రెడ్డి, ఎమ్మెల్యే పాయల శంకర్ భార్య, కాంగ్రెస్ నుంచి మౌనా రెడ్డి, గండ్రత్ సుజాత, బీఆర్ఎస్ నుంచి మాజీమంత్రి జోగు రామన్న కోడలు మాజీ మున్సిపల్ చైర్మన్ సతీమణి వాణిశ్రీ పేర్లు వినిపిస్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఆలూరు గంగారెడ్డి కూతురు విజయభారతి రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి సతీమణి రజిత రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కూతురు పైడి సుచరిత రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వినయ్ రెడ్డి సతీమణి అనన్య రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ సతీమణి , మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత.. మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ., మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి సతీమణి సుహాసిని, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సోదరీమణి వేముల రాధిక, కామారెడ్డిలో టీఎస్పీఎస్ మాజీ సభ్యురాలు, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు తానోభా సుమిత్రా ఆనంద్, కాంగ్రెస్ పార్టీ నుంచి కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ, యెల్లారెడ్డి నియోజకవర్గం నుండి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి సతీమణి, జుక్కల్ నియోజకవర్గం.. మాజీ ఎమ్మెల్యే అరుణతార (ఎస్సీ), మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం సతీమణి సౌదాగర్ సావిత్రిబాయి (ఎస్సీ), కామారెడ్డి మాజీ జిల్లా పరిషత్ దఫేదార్ శోభ, యెల్లారెడ్డి నియోజకవర్గం.. ఏనుగు రవీందర్ రెడ్డి సతీమణి ఏనుగు మంజుల రెడ్డి.., నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం.. మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గడ్డం సుమనారెడ్డి.. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత.. నిజామాబాద్ అర్బన్ బీజేపీ నాయకురాలు గడ్డం స్రవంతి రెడ్డి తదితరులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతున్నారు. ఉమ్మడి మెదక్‌జిల్లా సిద్దిపేట నియోజకవర్గంలో తన్నీరు శ్రీనిత, (మాజీ మంత్రి హరీశ్‌రావు సతీమణి), కల్వకుంట్ల కవిత (మాజీ ఎంపీ), వేలేటి రోజాశర్మ (మాజీ జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్), పూజల శైలజ (నియోజక ఇన్చార్జి హరికృష్ణ సతీమణి, కాంగ్రెస్), భైరి లత మాధవి (బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ భార్య), చేరెడ్డి ఆరోషిక రెడ్డి ( చక్రధర్ గౌడ్, భార్య), దూది స్రవంతి (నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జి శ్రీకాంత్ రెడ్డి భార్య), డా.నిమ్మ శాలినీరెడ్డి (కాంట్రాక్టర్ వంగ రాజేశ్వరరెడ్డి, భార్య) తదితరులు పోటీ పడనున్నారు. గజ్వేల్ నుంచి తూంకుంట ఆంక్షరెడ్డి (డీసీసీ అధ్యక్షురాలు), బండారు సింధూరా (కాంగ్రెస్ నేత శ్రీకాంత్ రావు భార్య), వంటేరు సుజాత(ప్రతాప్ రెడ్డి భార్య, బీఆర్ఎస్), చిట్టి మాధురి (డీసీసీబీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, భార్య), ఈటల శమిత (ఎంపీ ఈటల రాజేందర్ కోడలు, బీజేపీ) ఈటల జమున (రాజేందర్ భార్య, బీజేపీ), ఆకుల విజయ (బీజేపీ నేత) హేమలత శేఖర్ గౌడ్ (మాజీ జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్), దుబ్బాక నియోజక వర్గం నుంచి మాధవనేని మంజులా దేవి (ఎంపీ రఘునందన్ రావు, భార్య ) మాధవనేని సింధు ( ఆయన కూతురు) , కొత్త మంజులత (ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, భార్య బీఆర్ఎస్) కొత్త కీర్తి రెడ్డి ( ఆయన కూతురు,బీఆర్ఎస్), హుస్నాబాద్ నియోజక వర్గం... పొన్నం మంజుల (మంత్రి పొన్నం, భార్య, కాంగ్రెస్) వొడితల శమిత (మాజీ ఎమ్మెల్యే సతీష్, భార్య, బీఆర్ఎస్), కర్ణకంటి మంజుల (కాంగ్రెస్) , జన్నపు రెడ్డి (జన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి భార్య, బీజేపీ) బొమ్మ (కాంగ్రెస్ నేత బొమ్మ శ్రీరాం చక్రవర్తి భార్య) , మెదక్ సెగ్మెంట్.. పద్మా దేవేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే, కరణం పరిణిత(మాజీ మంత్రి కరణం రామచందర్ రావు కోడలు), పట్లోళ్ల సునీత (మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి భార్య, బీఆర్ఎస్), లావణ్య రెడ్డి (మాజీ జెడ్పీ వైస్ ఛైర్పర్సన్, బీఆర్ఎస్), రాధిక భూపతి రాజ్ (మెదక్ మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్), కొండన్ సావిత్రి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్.. నర్సాపూర్ నియోజకవర్గం.. సునీతా రెడ్డి (మాజీ మంత్రి, బీఆర్ఎస్) రాజమణి (మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, బీజేపీ) చిలుముల సుహాసిని రెడ్డి( గ్రంథాలయ సంస్థ చైర్మన్, కాంగ్రెస్), సంగారెడ్డి సెగ్మెంట్ నుంచి జయారెడ్డి (జగ్గారెడ్డి కూతురు), నిర్మల (జగ్గారెడ్డి సతీమణి) చింతా అరుణ (ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భార్య, బీఆర్ఎస్), ప్రగతి ( దేశ్ పాండే బీజేపీ లీడర్, భార్య), రషిత( దేశ్‌పాండే కూతురు), ఆందోలు నియోజకవర్గం... పద్మిని ,(మంత్రి రాజనర్సింహ, భార్య ) త్రిష, (మంత్రి దామోదర్ కూతురు, కాంగ్రెస్), పద్మ, (క్రాంతి కిరణ్ భార్య, బీఆర్ఎస్) పట్లోళ్ల మంజు శ్రీ (జెడ్పీ మాజీ చైర్మన్, సంగారెడ్డి) వీణ, (కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి భార్య, బీఆర్ఎస్), నారాయణఖేడ్ నియోజకవర్గం.. పట్లోళ్ల అనుపమ రెడ్డి (ఎమ్మెల్యే సంజీవరెడ్డి భార్య, కాంగ్రెస్) మహారెడ్డి జయశ్రీ రెడ్డి (మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి భార్య, బీఆర్ఎస్), మహారెడ్డి శ్రేయ రెడ్డి(మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి కూతురు, బీఆర్ఎస్), గుర్రపు సౌమ్య(ఎన్ఆర్ఐ, బీఆర్ఎస్), ఉమాదేవి శెట్కర్ (ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్ భార్య, కాంగ్రెస్), మాల దేవి శెట్కర్ (మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కర్ భార్య, కాంగ్రెస్) పటాన్ చెరు సెగ్మెంట్.. యాదమ్మ, బీఆర్ఎస్ (ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి భార్య) సింధు, బీఆర్ఎస్ కార్పొరేటర్( మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి కోడలు), నీలం కవిత, కాంగ్రెస్( నీలం మధు ముదిరాజ్ భార్య) కాటా సుధా, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు (నియోజక కాంగ్రెస్ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ భార్య), గోదావరి( ఎమ్మెల్సీ అంజిరెడ్డి భార్య, బీజేపీ) జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ప్రమీల (మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ భార్య, కాంగ్రెస్), మధులత( ఎమ్మెల్యే మాణిక్ రావు భార్య, బీఆర్ఎస్), పుష్పరాణి (ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం భార్య, బీఆర్ఎస్) పోటీ ఉండనున్నారని సమాచారం. మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలో ఇప్పుడున్న నాయకుల కంటే సడన్‌గా ఎన్నికల నాటికి తెరమీదకు వచ్చేవారు ఎక్కువగా ఉంటారని అంచనా వేస్తున్నారు. నేరుగా పార్టీల ముఖ్య నాయకుల ఆశీస్సులతో టిక్కెట్ కోసం బరిలోకి దిగుతారని చెబుతున్నారు. బండ కార్తీక రెడ్డి, మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి, విజయా రెడ్డి, మాజీ మేయర్ విజయలక్ష్మి, దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, నగరంలో మహిళా నేతల సంఖ్యకు కొదువలేదని చెబుతున్నారు.

# బెంబేలెత్తిన ఐటీ కారిడార్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది. ఇప్పటికే అత్యంత రద్దీగా ఉండే గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ, నార్సింగి, హైటెక్ సిటీ మార్గాల్లో ఒక వాహనం బ్రేక్‌డౌన్ అయినా చాలు.. క్షణాల్లోనే కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. తాజాగా బుధవారం నార్సింగి, నానక్‌రామ్‌గూడ వైపు నుంచి గచ్చిబౌలికి వచ్చే మార్గంలో ఓ ఎస్‌యూవీ కారు కారు ఆకస్మికంగా రోడ్డుపై నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఘటనతో ఓఆర్ఆర్ మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్తున్న వేలాది మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండుతున్న ఎండల్లో కార్లు, బైక్‌లపై ప్రయాణిస్తున్న వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. కొందరు ఉద్యోగులు ఆఫీసులకు ఆలస్యంగా చేరుకోగా, మరికొందరు ముఖ్యమైన సమావేశాలు కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు కిలోమీటరు పైగా బారులు తీరగా, ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులకు గంటన్నరకు పైగా సమయం పట్టింది.

**నిత్యకృత్యంగా మారిన బ్రేక్‌డౌన్‌లు..**

గచ్చిబౌలి, హైటెక్‌సిటీ ప్రాంతాలు నగరానికి ఐటీ హబ్‌గా మారిన తర్వాత ఇక్కడ వాహనాల సంఖ్య అమాంతం పెరిగింది. నగరం నలుమూలల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఐటీ కారిడార్‌కు వచ్చి వెళుతుంటారు. దీంతో ఇక్కడి రోడ్లపై వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట వాహనాలు బ్రేక్‌డౌన్ కావడం ట్రాఫిక్‌జామ్‌కు దారి తీస్తోందని పోలీసులు పేర్కొంటున్నారు. ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి జంక్షన్, ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) వైపు, మసీద్‌బండా, ఐకియా ఫ్లైఓవర్, హైటెక్‌సిటీ మెయిన్ రోడ్ వంటి ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఐటీ ఉద్యోగుల హైబ్రిడ్ వర్క్ కారణంగా మంగళ, బుధ, గురు వారాల్లో రద్దీ మరింత పెరుగుతోంది. ఒక్క గంటలోనే 10వేలకు పైగా సింగిల్ రైడర్ వెహికిల్స్ రోడ్డు మీదకు వస్తున్నాయని ఇటీవల మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన సర్వేలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా రద్దీ సమయాల్లో బ్రేక్‌డౌన్ అయిన వాహనాన్ని పక్కకు తీయడానికి ట్రాఫిక్ పోలీసులు గంటల తరబడి శ్రమించాల్సి వస్తోంది. మరోవైపు ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయడం పోలీసులకు మరో సవాల్‌గా మారింది. ఈ పరిస్థితులపై ఐటీ ఉద్యోగులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోజూ కార్యాలయాలకు చేరుకోవడానికి గంటల సమయం పడుతోందని, ట్రాఫిక్‌లోనే విలువైన సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. వాహనాల తొలగింపుకు ఫాస్ట్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేయడం, ప్రత్యామ్నాయ మార్గాలు అభివృద్ధి చేయడం, ట్రాఫిక్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయడం అవసరమని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో ఐటీ కారిడార్ ట్రాఫిక్ సమస్య మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బాలుడికి యాసిడ్ తాగించిన పిన్ని

**మేడిపల్లి,ఫ్లాష్ ఇండియా :** మన కళ్లను మనమే నమ్మలేని స్థాయిలో నేరాలు జరుగుతున్నాయి. తాజాగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన క్రైమ్ మానవత్వాన్ని మంటగలిపేలా ఉంది. తన కొడుకును ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే కారణంతో నాలుగేళ్ల బాలుడికి యాసిడ్ తాగించిందో పిన్ని. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ శ్రీనివాస కాలనీలో ఉండే పర్వతం సతీశ్ కుమార్ అంజమ్మ దంపతులకు నాగరాజు, జగదీశ్ ఇద్దరు కుమారులు. వీరికి వివాహాలు అయి పిల్లలు కూడా ఉన్నారు. అంతా ఒకే ఇంట్లో ఉంటున్నారు. అయితే పెద్ద కుమారుడి కొడుకు (4)పై తాతా ఎక్కువ ప్రేమ చూపిస్తూ తమ బిడ్డను పట్టించుకోవడం లేదని చిన్న కొడకు భార్య మంజుల కక్ష పెంచుకుంది. ఇటీవల తాత తన చేతిపై పెద్ద మనవడి పేరును పచ్చబొట్టు వేయించుకున్నాడు. దీంతో మరింత కోపం పెంచుకున్న మంజులా ఎలాగైనా ఆ బాలుడిని అంతం చేయాలని నిర్ణయించుకుంది.

**రెండుమూడు సార్లు విఫలమై..**

ఎలాగైనా ఆ బాలుడిని అంతం చేయాలని లోలోపల రగిలిపోతున్న మంజుల ఇటీవల ఇంట్లో చిన్నారి నోరు, ముక్కు మూసి చేతులు పట్టుకుంది. బాలుడి తల్లి గమనించి ప్రశ్నించడంతో తాము ఆడుకుంటున్నామని చెప్పి తప్పించుకుంది. ఆ తర్వాత ఇంటి పై అంతస్తుకు తీసుకెళ్లిరెయిలింగ్ పై కూర్చొబెట్టింది. ఇది గమనించిన తాత ఆమెను మందలించాడు. ఇదిలా జరుగుతున్న క్రమంలోనే ఈ నెల 9వ తేదీన ఆ బాలుడిని కిచెన్ లోతి కీసుకువెళ్లి తాను జ్యూస్ తాగితే టాక్లెట్ ఇస్తానని ఆశచూపి జ్యూస్ కు బదులు ఆ చిన్నారి చేత యాసిడ్ తాగించింది. కొద్దిసేపటికే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురవడంతో విషయం గమనించిన తల్లిదండ్రులు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై బాలుడి తల్లి మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మహిళా న్యాయవాదులకు విశ్రాంతి గది





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణంలోని కోర్టు సముదాయం లో మహిళా న్యాయవాదులకు ప్రత్యేక విశ్రాంతి గది ని ప్రారంభించడం జరిగింది. ముఖ్యఅతిథి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సీనియర్ న్యాయవాది నేతి సత్యనారాయణ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి విశ్రాంతి గదిని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల మహిళ న్యాయవాదుల విశ్రాంతి గది సమస్య పరిష్కారం మా అసోసియేషన్ కమిటీ పిరియడ్ లో కావడం,విశ్రాంతి గది ప్రారంభం అవడం ఎంతో సంతోషంగా ఉందని,ఈ సందర్భంగా ఈ గది ఓపెనింగ్ కు సహకరించిన కమిటీ సభ్యులు,న్యాయవాదులు భూపతి రెడ్డి,సుండి శ్రీనివాస్,గొడ్డాటి సాయికుమార్,సిహెచ్ పద్మయ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులు మాట్లాడుతూ తమకు ప్రత్యేక విశ్రాంతి గదిని నిర్మించడం పట్ల సంతోషాన్ని వ్యక్తపరచారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గౌరు వెంకటేశ్వర్లు,స్వరాజ్యం,కొంక నిర్మల,నక్క సంతోషలక్ష్మి,ఆస్మా,భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే ప్రజా ఉద్యమమే




**మహబూబ్ నగర్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే ఉద్యమబాట పడతామని 'ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ' చైర్మెన్ జి.రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రాజెక్టుల పేరు మీద ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు పాలమూరు ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. నల్లగొండ రాజకీయ నాయకులు కొత్తగా డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పథకం తెచ్చి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నీటిని తరలించుకపోతామంటే ప్రజా ఉద్యమమే జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ పథకం ద్వారా నల్లగొండ జిల్లాలో 3 లక్షల 36 వేల 540 ఎకరాలకు నీరు పారుతుందని, మహబూబ్ నగర్ జిల్లాలో 24,400 ఎకరాలకే నీటిని పారించి జిల్లా రైతాంగాన్ని మోసం చేసున్నారని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాతి మొదటి పాలకులు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కు శ్రీశైలం నుండి నీళ్ళు తీసుకురావాలనే ఆలోచనతో ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. నార్లాపూర్, ఎదుల, కరివెన, లక్ష్మీదేవపల్లి పనులు 50 శాతం కూడా పూర్తి కాలేదని, ఉద్దండాపూర్ రిజర్వాయర్ పనులు10 శాతం కూడా కాలేదని ఆయన విమర్శించారు. 40 టిఎంసీ ల నీటితో శ్రీశైలం రిజర్వాయర్ వెనుక జలాల నుండి 3 దశల్లో నీటిని ఎత్తిపోసి, దాదాపు 4 లక్షల ఎకరాలకు అందించే కల్వకూర్తి ఎత్తిపోతల పథకం 2005 మొదలుపెట్టి నేటి వరకు పూర్తి చేయలేదని ఆయన ఎత్తి పొడిచారు. వెంటనే ఈ నీటి దోపిడీ అరికట్టి ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి మాట్లాడుతూ, జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయక, సాగునీరు అందక పాలమూరు జిల్లా ఎడారిగా మారే ప్రమాదం దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. త్వరలో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా ఉమ్మడి జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జెఏసి చైర్మెన్ గా రాజేందర్ రెడ్డి ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తిమ్మప్ప, ఖలీల్, చెన్నకిష్టయ్య, వీరబ్రహ్మాచారి, హనీఫ్ అహ్మద్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ వికటించి మృతి




**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** కడుపు నొప్పితో ఆసుపత్రికి వెళ్లిన మహిళ కొద్దిసేపటికే మృతి చెందింది. వైద్యులు ఆపరేషన్ చేసే ప్రయత్నంలో విఫలమవడంతోనే యువతి చనిపోయిందని ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. అమీన్‌పూర్ తిరుమల ఆసుపత్రిలో ఈ ఘటన జరిగింది. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన హారిక (28) కడుపునొప్పితో గురువారం ఇక్కడి తిరుమల ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆమెకు పలుపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆపరేషన్ చేయాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి 9 గంటలకు హారికను ఆపరేషన్‌కు తీసుకెళ్లగా, కొద్దిసేపటికే ఆమె మరణించినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. వైద్యం వికటించడంతోనే హారిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఆసుపత్రి ఎదుట ఆందోళన..**

హారిక మృతితో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఇటీవల మరో వ్యక్తి కూడా వైద్యం వికటించడంతో మరణించగా, లక్షల రూపాయలు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసినట్లు వారు ఆరోపించారు. హారిక మృతి పై విచారణ జరిపి, వైద్యం సక్రమంగా చేయకుండా ఆపరేషన్ చేసిన వైద్యుల పై కేసునమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కడుపు నొప్పికి సర్జరీ ఎందుకు చేశారని ప్రశ్నిస్తున్నారు. ఆందోళన తీవ్రం కావడంతో పోలీసు బలగాలు ఆసుపత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశాయి. విచారణ జరిపి న్యాయం చేసేవరకు ఊరుకోబోమని కుటుంబ సభ్యులు హెచ్చరిస్తున్నారు.



# ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

**అశ్వరావుపేట,ఫ్లాష్ ఇండియా :** అశ్వరావుపేట మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు డయాగ్నస్టిక్ సెంటర్లను గురువారం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్(మలేరియా) డాక్టర్ రామదాసు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి తుకారామ్ రాథోడ్ ఆదేశానుసారం నిర్వహించిన తనిఖీల్లో పలు లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ రామదాసు తెలిపారు. తనిఖీలలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, డిపిఎంఓ మోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ బేబీ, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ లు పాల్గొన్నారు.


# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి పకడ్బందీ చర్యలు



**కూసుమంచి,ఫ్లాష్ ఇండియా :** కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్టు అమలు పై కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ సమీక్ష నిర్వహించారు. ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్టు అమలు పై రెవెన్యూ, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలకు పరిష్కారం కోసం రెవెన్యూ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలోని కూసుమంచి మండలంలో ప్రవేశపెట్టిందని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద భూములు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ లు అందించే దిశగా ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ రూపొందించామని అన్నారు. రైతులు ఇంటి వద్ద నుంచి కూడా స్లాట్ బుకింగ్ చేసుకునేలా పోర్టల్ తయారు చేశామని, రైతులు లాగిన్ కాగానే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు చెల్లించిన తర్వాత గ్రామంలోని లైసెన్స్ సర్వేయర్ లాగిన్ కు వెళ్తాయని, రెండు రోజుల్లో ఆ రైతు భూమికి సరిహద్దు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసి ఏడు రోజుల లోపు సర్వే పూర్తి చేస్తారని, ఈ వివరాలను సర్వేయర్ సిస్టంలో నమోదు చేశాక దరఖాస్తుదారుడైన రైతు సర్వే మ్యాప్‌నకు యూనిక్, భూధార్ నెంబర్లు కేటాయిస్తారని భూభారతి పోర్టల్ లో కూడా వివరాలు నిక్షిప్తమవుతాయని అన్నారు. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ జనరేట్ చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేస్తారని ఈ ప్రక్రియలు దరఖాస్తు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్ మొబైల్ నెంబర్ కు మెసేజ్ వస్తాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ముందుగా కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూ భారతి కింద ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, కలెక్టరేట్ భూ భారతి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు 2026-2027 ఎన్నికలకు సంబంధించి వివిధ పదవులకు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్గా పుట్లూరు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులను ఒక సెట్ మాత్రమే దాఖలు కాగా వారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మిర్యాలగూడ బార్ అసోసియేషన్ కార్యవర్గం జాబితా ఈ క్రింది విధంగా ఉంది:

**ప్రధాన కార్యవర్గ పదవులు:**

అధ్యక్షులు(ప్రెసిడెంట్): గౌరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి: జంగిలి యల్లయ్య, ఉపాధ్యక్షులు (1): ఇసరం కరుణాకర్, జాయింట్ సెక్రటరీ (2): కొంక వెంకన్న ,రాయరపు భాస్కర్,కోశాధికారి: రెడ్డిపల్లి సైదులు, మహిళా ప్రతినిధి: బి. జ్యోతి, ఆటల విభాగం: భూక్యా రమేష్, గ్రంథాలయ అధికారి గా రాయారపు భాస్కర్, కందిమళ్ల వెంకటరెడ్డి,

**కార్యనిర్వాహక సభ్యులు (Executive Members):**

పెండ్యాల నరసింహారావు,సకినాల వేలాద్రి,గాదె చంద్రశేఖర రెడ్డి,జెయిని సుష్మిత,బంటు మహేష్,బొంగరాల నాగరాజు,

**ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించే అధికారులు:**

గొడ్డటి సాయికుమార్ యాదవ్,

మన్నెం కామేశ్వర్ రెడ్డి లుగా ఉండగా పై కార్యవర్గం మొత్తం గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నా ఎన్నిక కు సహకరించిన సహకరించిన సీనియర్ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలుపుతూ,జూనియర్ న్యాయవాదులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు




**కొమురవెల్లి,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రజల, రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం 6 గ్యారంటీల అమలు కోసం 1000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసిందని జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల స్థాయి సభ నిర్వహించారు. అందులో భాగంగా కొమురవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కొమురవెల్లి మండల స్థాయి సభలో జిల్లా కలెక్టర్ కే. హైమావతి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల మండల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టిన ప్రజా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజులపాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని దానిలో భాగంగా ఈ నెల 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించామని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి సభను నిర్వహిస్తున్నామని అన్నారు. మే మాసంలో నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రతివారం ఒక డిపార్ట్మెంట్ టీమ్ ను తీసుకొని జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**


మొదటి వారం ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైల్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించామని, తర్వాత హెల్త్ వీక్, ఇప్పుడు అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజల సురక్షిత ప్రయాణం కోసం వాహనదారులు తప్పకుండా రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు. సంక్షేమ కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రణ, రైతు సంక్షేమం, విద్యా కార్యక్రమాలు, క్రీడలు యువజన సంక్షేమం, మహిళా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై నిర్ణీత ప్రణాళిక ప్రకారం 99 రోజుల్లో నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో కొత్తగా 25 వేల రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ప్రతి నెల 6580 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం, జిల్లాలో 11241 ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ కోసం 22 కోట్ల,గృహ జ్యోతి లబ్దిదారులకు 152 కోట్ల,రైతు భరోసా పథకం కింద 392 కోట్ల, మహిళల ఉచిత బస్సు ప్రయాణం కు 330 కోట్లు. పేద ప్రజల అభివృద్ధి, రైతుల సంక్షేమ, అభివృద్ధి కోసం వెయ్యి కోట్ల రూపాయలు ఆరు గ్యారెంటీ ల ద్వారా జిల్లాలో ప్రభుత్వం ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ వారి ద్వారా రహదారి భద్రత పై,మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా పౌష్టికాహారం తీసుకోవడంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్ దివ్య, ఎంపీడీవో లక్ష్మప్ప, సర్పంచ్ గొల్లపల్లి పద్మ ఆంజనేయులు, నాయకులు మహాదేవుని శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# గీసుగొండలో చైన్ స్నాచర్ కలకలం



**గీసుకొండ,ఫ్లాష్ ఇండియా :** మహిళా మెడలో నుంచి పుస్తెల తాడు లాక్కొని బైకు పై పరారైన ఘటన గీసుకొండ మండలంలో చోటు చేసుకుంది. సీఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూర్యతండా గ్రామానికి చెందిన తన కూతురు, అల్లుడు, తాళ్లపల్లి కవిత, రాజయ్య ఈనెల 12న ఆదివారం గృహ ప్రవేశానికి వచ్చారు. గృహ ప్రవేశం పూర్తయిన తరువాత తిరిగి ఈనెల 15న కూతురు ఇంటి ముందు కూర్చొని ఉండగా.. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మంచి నీరు కావాలని అడిగారు. వెంటనే తన మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కొని బైకు పై పారిపోయారని పాలడుగు రామనర్సమ్మ ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్టు వెల్లడించారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** వీర్లపాలెం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాపోలు పుష్పలత ని మరియు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత స్కూల్ అసిస్టెంట్ పుల్ల సారయ్య సార్ ని అంబేద్కర్ యువజన సంఘం వీర్లపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది. గత 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావించి ఎంతోమందిని పిల్లలకు చదువులు చెప్పి అందరిని ఉన్నత విద్యావాంతులుగా తీర్చిదిద్ది నియోజకవర్గం స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు తీసుకోవడం మా గ్రామానికి చాలా గర్వ గర్వకారణం. మీరు ఇంకా ఇలాంటి అవార్డులు ఎన్నో అందుకోవాలని అంబేద్కర్ యూత్ వీర్లపాలెం గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.

# లక్నోపై మంచి రిథమ్ అందుకున్నా!



ఐపీఎల్ 2026లో భాగంగా బుధవారం రాత్రి లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్జీ)పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేసర్ జోష్ హేజిల్‌వుడ్ అద్భుత ప్రదర్శన చేశాడు. నాలుగు ఓవర్లలో 20 రన్స్ మాత్రమే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. ఆర్సీబీ విజయంలో కీలక పాత్ర పోషించిన హేజిల్‌వుడ్‌ను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు వరించింది. అవార్డు అందుకున్న ఈ ఆసీస్ స్టార్ మ్యాచ్ అనంతరం తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. గత కొన్ని నెలలు తనకు కాస్త కష్టంగా గడిచాయని, అయితే గత మ్యాచ్‌లో (రాజస్థాన్ రాయల్స్) తన రిథమ్‌ను కాస్త తిరిగి అందుకున్నానని తెలిపాడు. ఆర్ఆర్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ దెబ్బకు అప్పటివరకూ ఉన్నవన్నీ చెల్లాచెదురయ్యాయని చెప్పాడు. ఎల్ఎస్జీ మ్యాచ్‌లో మరింత మెరుగ్గా అనిపించిందని, ఇప్పుడు తన బౌలింగ్ రిథమ్ మంచి స్థితిలో ఉందని హేజిల్‌వుడ్ చెప్పాడు.'గత కొన్ని నెలలు నాకు దీర్ఘ ప్రయాణంలా అనిపించాయి. అయితే రాజస్థాన్‌తో జరిగిన గత మ్యాచ్‌లో కొంత రిథమ్ తిరిగి వచ్చింది. వైభవ్ సూర్యవంశీ బాగా ఆడాడు. అతడు ఉన్నంతసేపు లయ తప్పాను. ఈరోజు మాత్రం చాలా బాగుంది. నా బౌలింగ్ రిథమ్ మంచి స్థితిలో ఉంది. సరైన లెంగ్త్ బంతులు వేయాలంటే.. చాలా విషయాలపై ఆధారపడి ఉంటుంది. మీరు ఎవరితో ఆడుతున్నారో, ప్రత్యర్థి బ్యాటర్లు ఎవరన్నది, అలాగే పిచ్ పరిస్థితులు కూడా కీలకంగా ఉంటాయి. ఈరోజు పిచ్ చాలా నెమ్మదిగా ఉంది. కొంచెం బౌన్స్ కూడా ఉంది. అందుకే సరైన లెంగ్త్‌లో బంతులు వేస్తూ ఫలితం సాధించా' అని జోష్ హేజిల్‌వుడ్ చెప్పాడు.'ఈ విజయంలో జట్టులోని ప్రతి ఒక్కరి కృషి ఉంది. ప్రతి బౌలర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. నేను టెస్ట్ బౌలర్ కావడంతో స్లోవర్ బాల్స్ వంటి వెరైటీ డెలివరీలు వేయడం కొంచెం కష్టం. అయినప్పటికీ వాటిపై పని చేస్తూనే ఉన్నాను. స్లో డెలివరీలు నా ఆయుధాల్లో భాగంగా ఉంచుకోవాలి. భువనేశ్వర్ కుమార్‌తో నేను ఎప్పటికప్పుడు చర్చిస్తుంటా. మా బౌలింగ్ యూనిట్ మొత్తం మ్యాచ్ పరిస్థితులను త్వరగా అర్థం చేసుకుని మైదానంలో చర్చలు చేస్తాం. ప్లాన్ ప్రకారం బౌలింగ్ చేస్తాం. అదే మాకు పెద్ద ప్లస్ పాయింట్. రసిఖ్ సలామ్ దార్ మొదటి కొన్ని మ్యాచ్‌లు మిస్ అయ్యాడు. ఇటీవల మ్యాచ్‌ల్లో వచ్చిన అవకాశాన్ని బాగా ఉపయోగించుకున్నాడు. అతడు ప్రాక్టీస్‌లో చాలా కష్టపడుతున్నాడు. అతనికి మంచి నైపుణ్యాలు ఉన్నాయి. కఠినమైన ఓవర్లు కూడా బాగా వేస్తున్నాడు. ఈ టోర్నమెంట్ అతనికి చాలా కీలకం. ఐపీఎల్ 2026లో సాధ్యమైనంత వరకు ఆడుతా. ముందున్న షెడ్యూల్ కూడా అనుకూలంగా ఉంది. కాబట్టి నేను వరుసగా మ్యాచ్‌లు ఆడగలనని ఆశిస్తున్నాను' అని హేజిల్‌వుడ్ తెలిపాడు.





# ఆ 'స్టన్నింగ్ క్యాచ్' వల్లే మ్యాచ్ గెలిచాం..

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. సమష్టిగా రాణించిన రజత్ సేన మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. అయితే ఈ మ్యాచ్ అనంతరం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బౌలర్ల అసాధారణ ప్రదర్శన, మంచి ఫీల్డింగ్‌తోనే విజయం సాధించామని చెప్పాడు. "ఫిల్ సాల్ట్ అద్భుతంగా క్యాచ్ పట్టాడు. ఈ స్టన్నింగ్ క్యాచ్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. మా బౌలింగ్ చాలా అద్భుతంగా ఉంది. టాస్ గెలవడం ఈ మ్యాచ్‌లో కలిసి వచ్చింది. ఇక మా టీమ్‌లో ఫాస్ట్ బౌలర్లు బాగా రాణించారు. కండీషన్స్‌కు తగ్గట్టు బౌలింగ్ వేశారు. కృనాల్ ధైర్యవంతుడు. ఎలాంటి బాల్స్ వేస్తాడో నాకు కూడా తెలియదు. సుయాష్ శర్మ స్టంప్-టు-స్టంప్ లైన్‌లో బౌలింగ్ చేసిన విధానం అద్భుతంగా ఉంది. భువనేశ్వర్ కుమార్, జోష్ హాజెల్‌వుడ్ సైతం అదరగొట్టారు. ఒక కెప్టెన్‌గా ఇలాంటి స్పెషలిస్ట్ బౌలర్లు జట్టులో ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. వీళ్ల వల్ల నా పని చాలా ఈజీగా మారుతుంది. ఎందుకంటే నెక్స్ట్ ఓవర్‌లో ఎలా బౌలింగ్ చేయాలో వాళ్లకు చెప్పనవసరం లేదు. వాళ్లకు ఉన్న అనుభవం, ఆలోచనలు ఇతర బౌలర్లకు కూడా ఎంతో సహాయపడుతున్నాయి. ఈ సీజన్ ఆరంభం నుంచే మా ఫీల్డింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. దానికి తగ్గట్టుగానే ఫిల్ సాల్ట్ అద్భుతమైన ఫీల్డింగ్ చేశాడు. ఈ రోజు సాల్ట్ తీసుకున్న క్యాచ్ చాలా గొప్పది." అని కెప్టెన్ రజత్ పాటిదార్ తెలిపాడు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు ఆర్సీబీ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. ఈ సీజన్‌లో లక్నోకు ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. మిచెల్ మార్ష్ (40), ఆయుష్ బదోని (38) మినహా మిగిలిన వారెవరూ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ (4/24) నాలుగు వికెట్లతో చెలరేగగా, భువనేశ్వర్ కుమార్ మూడు, కృనాల్ పాండ్యా రెండు వికెట్లు తీసి లక్నోను దెబ్బకొట్టారు. 147 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి 'ఛేజ్ మాస్టర్' విరాట్ కోహ్లీ 49 పరుగులు చేశాడు. మొదటి నుంచే దూకుడుగా ఆడిన కోహ్లీ 34 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 49 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. కానీ తృటిలో ఓ రికార్డును మిస్ చేసుకున్నాడు. తన 66వ ఐపీఎల్ హాఫ్ సెంచరీకి కేవలం ఒక పరుగు దూరంలో పెవిలియన్‌కు చేరుకున్నాడు. అవేష్ ఖాన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగ్ ఆన్ వద్ద నికోలస్ పూరన్‌కు చిక్కాడు. కోహ్లీ నిష్క్రమించిన తర్వాత కెప్టెన్ రజత్ పాటిదార్ (27), వికెట్ కీపర్ జితేష్ శర్మ (23) వేగంగా పరుగులు సాధించి జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో ఆర్సీబీ కేవలం 15.1 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నప్పటికీ జట్టును ఓటమి నుంచి తప్పించలేకపోయాడు.

# దాచడానికి ఏముంది, మేం చెత్తగా ఆడాం..



ఐపీఎల్ 2026 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్జీ) ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో రెండే విజయాలు సాధించింది. ఈ సీజన్‌లో బ్యాటింగ్ విభాగంలో విఫలమవడం ఎల్ఎస్జీకి పెద్ద సమస్యగా మారింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మ్యాచ్ అనంతరం లక్నో తాత్కాలిక కెప్టెన్ నికోలస్ పూరన్ ఈ విషయాన్ని నిజాయితీగా అంగీకరించాడు. ఈ సీజన్ మొత్తం తమ బ్యాటింగ్ ప్రదర్శన అంచనాలకు తగ్గట్లుగా లేదని, చాలా చెత్తగా ఆడాం అని చెప్పాడు. దాచడానికి ఏముంది, బ్యాటింగ్ కారణంగానే పరాజయాలు ఎదురవుతున్నాయని పూరన్ స్పష్టం చేశాడు.'ఈ సీజన్ మాకు చాలా కష్టంగా సాగుతోంది. బ్యాటింగ్‌లో మేము అంచనాలకు తగ్గట్లుగా ఆడలేకపోయాం. ఆర్సీబీ మ్యాచ్‌లో 175 పరుగులు చేసినా పోటీ ఇచ్చేవాళ్ళం. కానీ మేం 20-30 రన్స్ తక్కువగా చేశాం. ఈ సీజన్ మొత్తం బ్యాటింగ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనేది నిజం. ఈరోజు కూడా బ్యాటింగ్ తప్పిదంతోనే మూల్యం చెల్లించాం. టీ20 క్రికెట్ అనేది చాలా కఠినమైన ఫార్మాట్. ఇందులో నిలకడగా రాణించడం అంత సులభం కాదు. అయినప్పటికీ మా ఆటగాళ్లు కష్టపడుతున్నారు. వారికి క్రెడిట్ ఇవ్వాలి. వేము పోరాడుతూనే ఉంటాం. ఓపికగా ఉండాలి, అవకాశాలు వచ్చినప్పుడు సిద్ధంగా ఉండాలి, బాధ్యత తీసుకుని రాణించాలి' అని నికోలస్ పూరన్ చెప్పాడు.'నా బ్యాటింగ్ బాగానే ఉంది. బంతిని బాగా టైమింగ్ చేసస్తున్నాను. కానీ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు నా నుంచి మంచి ఇన్నింగ్స్ రాలేదు. ఫామ్ కోల్పవడం నాకు కొత్త కాదు. ఇలాంటి పరిస్థితులను చాలాసార్లు ఎదుర్కొన్నాను. ఇలాంటి క్లిష్ట సమయంలో ఎలా బయటపడాలో నాకు తెలుసు. త్వరలోనే నేను తిరిగి ఫామ్‌లోకి వస్తాను' అని పూరన్ ధీమా వ్యక్తం చేశాడు. ఎల్ఎస్జీ బ్యాటింగ్‌లో ఇప్పటికైనా మెరగవకపోతే ఈ సీజన్‌లో తిరిగి పుంజుకోవడం కష్టమే. ఇకపై మ్యాచ్‌ల్లో జట్టు సమిష్టిగా రాణించాల్సిన అవసరం స్పష్టంగా ఉంది.

# ఒక్క పరుగు దూరంలో ఆగిన రికార్డ్!





**లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ పోరులో ఆర్ సీబీ బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించి జట్టుకు సులభతరమైన విజయాన్ని అందించారు. ఇక ఈ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. మొదటి నుంచే దూకుడుగా ఆడిన కోహ్లీ 34 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్ తో 49 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. కానీ తృటిలో ఓ రికార్డును మిస్ చేసుకున్నాడు. తన 66వ ఐపీఎల్ హాఫ్ సెంచరీకి కేవలం ఒక పరుగు దూరంలో పెవిలియన్ కు చేరుకున్నాడు. అవేష్ ఖాన్ బౌలింగ్ లో భారీ షాట్ కు ప్రయత్నించి లాంగ్ ఆన్ వద్ద నికోలస్ పూరన్ కు చిక్కాడు. కోహ్లీ అవుటైన సమయంలో స్టేడియంలో భార్య అనుష్క శర్మ తీవ్ర నిరాశకు గురైంది. ఈ దృశ్యం కెమెరాలకు చిక్కింది.ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు ఆర్ సీబీ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. ఈ సీజన్ లో లక్నోకు ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. మిచెల్ మార్ష్ (40), ఆయుష్ బదోని (38) మినహా మిగిలిన వారెవరూ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఆర్ సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ (4/24) నాలుగు వికెట్లతో చెలరేగగా, భువనేశ్వర్ కుమార్ మూడు, కృనాల్ పాండ్యా రెండు వికెట్లు తీసి లక్నోను దెబ్బకొట్టారు. 147 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్ సీబీకి 'ఛేజ్ మాస్టర్' విరాట్ కోహ్లీ 49 పరుగులు చేశాడు. కోహ్లీ నిష్క్రమించిన తర్వాత కెప్టెన్ రజత్ పాటిదార్ (27), వికెట్ కీపర్ జితేష్ శర్మ (23) వేగంగా పరుగులు సాధించి జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో ఆర్ సీబీ కేవలం 15.1 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ మూడు వికెట్లు తీసి ఆకట్టుకున్నప్పటికీ జట్టును ఓటమి నుంచి తప్పించలేకపోయాడు. ఈ విజయంతో ఆర్ సీబీ టోర్నీలో తన జోరును కొనసాగిస్తోంది.**

# బిజినెస్

## ఉబర్ రైడ్‌లపై 'సూపర్‌కాయిన్స్' ఆఫర్



ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్, క్యాబ్ సేవల అగ్రిగేటర్ ఉబర్ కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఉబర్ సేవలను ఉపయోగించుకునే కస్టమర్లకు ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన సూపర్‌కాయిన్స్ రివార్డుగా ఇచ్చేలా ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా వినియోగదారులు తమ ఫ్లిప్‌కార్ట్, ఉబర్ అకౌంట్లను లింక్ చేయాల్సి ఉంటుంది. ప్రతి ఉబర్ రైడ్‌పై ఖర్చు చేసిన మొత్తంలో 4 శాతం సూపర్‌కాయిన్స్‌గా పొందుతారు. ఒక్కో రైడ్‌కు గరిష్టంగా 150 కాయిన్స్ వరకు పొందవచ్చు. ఉబర్ రైడ్‌ల ద్వారా సంపాదించిన సూపర్‌కాయిన్స్ నేరుగా వినియోగదారుడి ఫ్లిప్‌కార్ట్ ఖాతాలో జమ అవుతాయి. వీటిని ఫ్లిప్‌కార్ట్, క్లియర్‌ట్రిప్, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్, ఫ్లిప్‌కార్ట్ ఎకోసిస్టమ్‌లోని ఇతర సేవల్లో రిడీమ్ చేసుకోవచ్చు. కొత్త ఉబర్ వినియోగదారులు, లేదా గత 84 రోజులుగా యాప్‌ను ఉపయోగించని వారు, తమ అకౌంట్లను లింక్ చేసిన 28 రోజుల్లోగా మొదటి రైడ్‌ను పూర్తి చేసి 150 బోనస్ సూపర్‌కాయిన్స్‌ను సంపాదించవచ్చు. ఏప్రిల్ 15-30 మధ్య లింక్ చేసి రైడ్ చేసేవారికి అదనపు రివార్డులు లభిస్తాయని ఇరు కంపెనీలు వెల్లడించాయి. ఈ భాగస్వామ్యం కస్టమర్లకు రోజువారీ రైడ్‌లపై అదనపు ప్రయోజనాలు అందించాలనే ఉద్దేశంతో కుదుర్చుకున్నామని కంపెనీలు పేర్కొన్నాయి.

## భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా



ఈ ఏడాది మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమెరికాను దాటి చైనా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అవతరించింది. ఈ కాలంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 151.1 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ. 14.09 లక్షల కోట్ల)కు చేరుకోగా, చైనాతో మనదేశ వాణిజ్య లోటు 112.16 బిలియన్ డాలర్లకు పెరిగిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. గత 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు వరుసగా నాలుగేళ్ల పాటు అమెరికానే భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగింది. కానీ, గతేడాదిలో చైనాకు భారత ఎగుమతులు 36.66 శాతం పెరిగి 19.47 బిలియన్ డాలర్ల(1.81 లక్షల కోట్ల)కు చేరుకోగా, దిగుమతులు 16 శాతం పెరిగి 131.63 బిలియన్ డాలర్ల(12.27 లక్షల కోట్ల)కు చేరాయి. 2024-25లో 99.2 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు, 2025-26 నాటికి చారిత్రాత్మక గరిష్ఠం 112.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. మరోవైపు, అమెరికాకు మన ఎగుమతులు 0.92 పెరిగి 87.3 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 15.95 శాతం పెరిగి 52.9 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 40.89 బిలియన్ డాలర్ల నుంచి 34.4 బిలియన్ డాలర్లకు తగ్గిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.



## యుద్ధం వేళ.. ఎగుమతులు డీలా

పశ్చిమాసియా యుద్ధం భారత ఎగుమతులపై భారీ ప్రభావం చూపుతోంది. మార్చి నెలలో భారత వస్తు ఎగుమతులు 57.95 శాతం క్షీణించాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ బుధవారం తెలిపారు. భారత్ సాధారణంగా పశ్చిమాసియాకు ప్రతీ నెలా 600 కోట్ల డాలర్ల (రూ.55,800 కోట్లు) విలువైన వస్తువులను ఎగుమతి చేస్తుందని, యుద్ధం కారణంగా మార్చిలో ఇవి 350 కోట్ల డాలర్ల (రూ.32,550 కోట్లు) మేర తగ్గి 250 డాలర్ల (రూ.23,250 కోట్లు) స్థాయికి పరిమితమైనట్లు ఆయన చెప్పారు. ప్రధానంగా జెమ్స్ అండ్ జువెలరీ, ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్, పెట్రోలియం ఉత్పత్తులు, బియ్యం ఎగుమతులపై అధిక ప్రభావం పడిందన్నారు. అంతేకాదు, పశ్చిమాసియా నుంచి భారత్‌కు దిగుమతులు సైతం 51.64 శాతం తగ్గాయన్నారు.

**9 నెలల కనిష్ఠానికి వాణిజ్య లోటు**

కేంద్ర వాణిజ్య శాఖ బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో మొత్తం ఎగుమతులు కూడా వార్షిక ప్రాతిపదికన 7.44 శాతం తగ్గి 3,892 కోట్ల డాలర్లకు (సుమారు రూ.3.62 లక్షల కోట్లు) పడిపోయాయి. దిగుమతులు కూడా 6.51 శాతం తగ్గుదలతో 5,959 కోట్ల డాలర్లకు (రూ.5.54 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. ముడిచమురు, పసిడి దిగుమతులు తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. వాణిజ్య లోటు 9 నెలల కనిష్ఠ స్థాయిలో 2,067 కోట్ల డాలర్లుగా (రూ.1.92 లక్షల కోట్లు) నమోదైంది.

**భారీగా తగ్గిన చమురు, బంగారం దిగుమతులు**

గత నెలలో ముడి చమురు దిగుమతులు 35.91 శాతం తగ్గి 1,218 కోట్ల డాలర్లకు (రూ.1.13 లక్షల కోట్లు) జారుకోగా.. పసిడి దిగుమతులు కూడా 31.63 శాతం తగ్గుదలతో 306 కోట్ల డాలర్లకు (రూ.28,458 కోట్లు) పరిమితమైనట్లు కేంద్రం తెలిపింది.

**భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా**

గత ఆర్థిక సంవత్సరంలో అమెరికాను వెనక్కి నెట్టి భారత్‌కు అతిపెద్ద భాగస్వామిగా చైనా అవతరించింది. 2025-26లో భారత్-చైనా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 15,110 కోట్ల డాలర్లకు (రూ.14.05 లక్షల కోట్లు) పెరిగింది. చైనాకు భారత ఎగుమతులు 36.66 శాతం పెరిగి 1,947 కోట్ల డాలర్లకు (రూ.1.81 లక్షల కోట్లు) చేరగా.. చైనా నుంచి భారత్‌కు దిగుమతులు కూడా 16 శాతం పెరిగి 13,163 కోట్ల డాలర్లకు (రూ.12.24 లక్షల కోట్లు) ఎగబాకాయి. దాంతో చైనాతో భారత్ వాణిజ్య లోటు కూడా 11,216 కోట్ల డాలర్లకు (రూ.10.43 లక్షల కోట్లు) పెరిగింది.

**ఏడాది ఎగుమతుల్లో రికార్డు-రూ.80 లక్షల కోట్లు**

ఈ మార్చి 31తో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్స రం మొత్తానికి వస్తు, సేవల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 4.22 శాతం వృద్ధితో ఆల్‌టైం రికార్డు స్థాయి 86,009 కోట్ల డాలర్లకు (రూ.79.99 లక్షల కోట్లు) పెరిగాయని వాణిజ్య శాఖ వెల్లడించింది. అందులో వస్తు ఎగుమతు లు ఒక శాతం పెరుగుదలతో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 44,178 కోట్ల డాలర్లకు (రూ.41.09 లక్షల కోట్లు) చేరగా, సేవల ఎగుమతులు 41,831 కోట్ల డాలర్లుగా (రూ.38.90 లక్షల కోట్లు) నమోదయ్యాయి. కాగా, 2025-26లో వస్తు దిగుమతులు 7.45 శాతం పెరుగుదలతో 77,498 కోట్ల డాలర్లకు (రూ.72.07 లక్షల కోట్లు) చేరాయి. దాంతో వాణిజ్య లోటు 33,320 కోట్ల డాలర్లుగా (రూ.30.99 లక్షల కోట్లు) నమోదైంది. ట్రంప్ సుంకాలు, పశ్చిమాసియా యుద్ధం వంటి సవాళ్ల నేపథ్యంలోనూ గత ఆర్థిక సంవత్సరం ఎగుమతి వాణిజ్యంలో భారత్ మెరుగైన పనితీరు కనబరిచిందని రాజేశ్ అగర్వాల్ అన్నారు.

## మళ్లీ పెరిగిన గోల్డ్ రేట్



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు త్వరలో కుదుటపడతాయన్న అంచనాల నడుమ భారత్‌లో బంగారం ధరల్లో నేడూ పెరుగుదల కనిపిస్తోంది. త్వరలో యుద్ధం ముగుస్తుందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో కమోడిటీ మార్కెట్స్‌లో లోహాలకు డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఏప్రిల్ 16) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర స్వల్పంగా పెరిగి రూ.1,55,570కు చేరింది. 22 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర కూడా కొద్దిగా ఎగబాకి రూ.1,42,600కు చేరుకుంది. కిలో వెండి ప్రస్తుతం రూ.2.75 లక్షల వద్ద కొనసాగుతోంది. విజయవాడలో ఇదే రేట్స్ కొనసాగుతున్నాయి.ఇతర ప్రధాన నగరాల్లో కూడా నేడు బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,660గా ఉంది. ముంబైలో రూ.1,55,570గా, ఢిల్లీలో రూ.1,55,720గా ఉంది. చెన్నైలో ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,43,600గా ముంబైలో రూ.1,42,600గా, ఢిల్లీలో రూ.1,42,750గా ఉంది. దేశంలో కిలో వెండి ధర రూ.2.75 లక్షల వద్ద తచ్చాడుతోంది. నిన్నటితో పోలిస్తే ధరలు స్థిరంగా ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ 24 క్యారెట్ల బంగారం 4,833 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## లాభాల్లో దేశీయ మార్కెట్ సూచీలు..

దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు లాభాల బాటలో పయనిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందుతున్న సానుకూల సంకేతాలతో ఇన్వెస్టర్లు కొనుగోళ్ల వైపు మొగ్గు చూపడంతో సూచీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఇవాళ ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే, అంటే ఉదయం 9.45 గంటల సమయానికి సెన్సెక్స్ 280 పాయింట్లు పెరిగి లాభాల్లో కొనసాగుతోంది. ఇక నిఫ్టీ 95 పాయింట్ల వృద్ధిని నమోదు చేసి కీలక స్థాయిల వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రధానంగా బ్యాంకింగ్, ఐటీ, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభిస్తుండటంతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. గడిచిన కొన్ని సెషన్లుగా ఒడిదుడుకులకు లోనైన సూచీలు, నేడు రికవరీ బాట పట్టడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని నింపింది.

# చైతు సెన్సేషన్ కామెంట్స్




టాలీవుడ్ యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య తన రాబోయే చిత్రాల గురించి అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్స్ అందించారు. ప్రస్తుతం చైతు 'వృషకర్మ' సినిమాలో నటిస్తున్నాడు. ంజఖఎ బ్యానర్ లో భోగవల్లి బాపినీడు నిర్మిస్తున్న ఈ సినిమా చైతు కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో తెరెకెక్కుతోంది. విరూపాక్ష వంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు కార్తీక్ దండు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ సినిమా ఫస్ట్ గ్లిమ్స్ కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సినిమాల అప్డేట్స్ గురించి చైతన్య మాట్లాడుతూ.. "నేను ప్రస్తుతం 'వృషకర్మ' షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో ఉన్నాను. ఇప్పటికే 85 శాతం చిత్రీకరణ పూర్తయింది, కేవలం 15 శాతం మాత్రమే మిగిలి ఉంది. ఈ చిత్రం చాలా వినూత్నంగా ఉండబోతోంది. అలాగే విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో తాను నటించిన ఓటీటీ డెబ్యూ 'ధూత' వెబ్ సిరీస్ కు సీక్వెల్ 'ధూత-2' కి సంబంధించిన స్క్రిప్ట్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి, త్వరలోనే ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్తుందని' తెలిపాడు. విలక్షణమైన థ్రిల్లర్ కథాంశంతో సాగే ఈ సిరీస్ కోసం ఫ్యాన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అటు వృషకర్మ నాగచైతన్య కెరీర్‌లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంటుందని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఈ ఏడాది చివర్లో వెండితెరపై చైతన్య సందడి చేసే ఛాన్స్ ఉంది. మొత్తానికి వరుస ప్రాజెక్ట్‌లతో చైతన్య ఫుల్ బిజీగా గడుపుతున్నారు.



# 'రాజా శివాజీ' ఫస్ట్ సాంగ్!

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరించేందుకు రితేష్ దేశ్‌ముఖ్ సిద్ధమయ్యారు. జియో స్టూడియోస్, ముంబై ఫిల్మ్ కంపెనీ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రాజా శివాజీ' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'రాజా శివాజీ ఆంథమ్' విడుదలైంది. ప్రముఖ ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ఈ సాంగ్ గురించి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ప్రముఖ గాయకుడు అజయ్ గోగవాలే తన గంభీరమైన గళంతో ఈ పాటను ఆలపించారు. శివాజీ మహారాజ్ శౌర్యాన్ని, పరాక్రమాన్ని కీర్తిస్తూ సాగే ఈ ఆంథమ్ వింటుంటేనే రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. అజయ్-అతుల్ అందించిన సంగీతం ఈ పాటకు ఆత్మలా నిలిచింది. పీరియాడిక్ డ్రామా కావడంతో విజువల్స్ పరంగా ఎక్కడా రాజీ పడకుండా రితేష్ దేశ్‌ముఖ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. ఈ సినిమాను మే 1, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. మరాఠీతో పాటు పలు భారతీయ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. పాన్ ఇండియా లెవల్‌లో శివాజీ మహారాజ్ కథను ఇంత గొప్పగా చూడటం ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# మోహన్ లాల్ ని చూసి నేర్చుకోండి

మాలీవుడ్ స్టార్ మోహన్ లాల్ జోష్ అండ్ జోరును యంగ్ హీరోలు బీట్ చేయలేరేమో..? 65 ఇయర్స్‌లో కూడా రెస్ట్ అనే పదాన్ని మర్చిపోయి బ్యాక్ టు బ్యాక్ మూవీస్ చేస్తున్నారు. గత ఏడాది హ్యాట్రిక్ హండ్రెడ్ క్రోర్ కొల్లగొట్టిన లాలట్టన్ జోరుకు గట్టి బ్రేకులేసింది వృషభ. కానీ ఈ ఫ్లాప్ ఆయన కెరీర్‌పై పెద్దగా ఇంపాక్ట్ చూపలేదు. ఈ ఏడాది కూడా ఇదే జోరు చూపించేందుకు ప్లానింగ్ సిద్ధం చేసుకున్నారు. కానీ కేరళ ఎన్నికలు, పశ్చిమాసియా దేశాల్లో యుద్ధం వల్ల దృశ్యం3, మల్టీస్టారర్ ఫిల్మ్ పేట్రియాట్ వాయిదా పడ్డాయి. తన ఫ్రెండ్ మమ్ముట్టితో కలిసి నటించిన పేట్రియాట్ మే1న రిలీజ్ అవుతుండగా.. దృశ్యం3 మే 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దృశ్యం3తో మరోసారి జీతూ జోసెఫ్‌తో చేతులు కలిపిన లాలట్టన్.. తన అప్ కమింగ్ మూవీకి తరుణ్ మూర్తిని రిపీట్ చేస్తున్నాడు. గత ఏడాది ఈ ఇద్దరి కాంబోలో వచ్చిన తుడరుమ్ బ్లాక్ బస్టర్ నమోదు చేయడంతో ఆ దర్శకుడికి మరో ఛాన్స్ ఇచ్చాడు లాలట్టన్. ఎల్366గా తెరకెక్కుతోన్న ఈ మూవీకి అతి మనోహరం అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఓ వైపు తన సినిమాలు చేస్తూనే.. ఎవరైనా క్యామియో రోల్ ఆఫర్ చేస్తే కాదనలేకపోతున్నాడు. గతంలో జైలర్, కన్నప్ప, భా భా బా మూవీలో స్పెషల్ రోల్స్‌లో మెరిశారు.

జైలర్‌లో కాసేపు కనిపించిన లాలట్టన్.. జైలర్2లో కూడా క్యామియోను కంటిన్యూ చేయబోతున్నాడు. పృథ్వీరాజ్ సుకుమార్ తెరకెక్కించే ఖలీఫా, జయసూర్య, అనుష్క జంటగా నటిస్తోన్న కథనార్‌లో కూడా కీ రోల్ చేయబోతున్నాడట. ఇంత బిజీలో కూడా స్పెషల్ రోల్స్ చేస్తూ క్యామియో కింగ్‌గా మారాడు లాలట్టన్.






# అందాలతో అలరిస్తున్న ఐశ్వర్య


ఐశ్వర్య రాజేష్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తమిళ చిత్రాల ద్వారా గుర్తింపును సంపాదించుకున్న ఈమె, ఆ తర్వాత టాలీవుడ్‌లో కూడా పలు విజయాలను అందుకొని తెలుగు సినిమా పరిశ్రమలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఈమె తన అందాలతో కాకుండా సహజమైన అందం, బలమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సినీ పరిశ్రమలో సంపాదించుకుంది. సినిమాల్లో పెద్దగా అందాలను ఆరబోయని ఈ బ్యూటీ, సోషల్ మీడియాలో మాత్రం అప్పుడప్పుడు తన అందాలతో కుర్రకారుకు గిలిగింతలు పెడుతుంది. ఈ నటి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన ఫోటోలను పోస్ట్ చేస్తూ వస్తోంది. తాజాగా ఈ నటి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని హాట్ లుక్‌లో ఉన్న ఫోటోలను పోస్ట్ చేసింది. అవి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ పిక్స్‌లో ఆమె గ్రీన్ కలర్ ట్రెడిషనల్ శారీలో కనిపిస్తూ తన అందాలతో అందరినీ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా స్టైలిష్ గ్రీన్ బ్లౌజ్‌తో పాటు డిజైన్ చేసిన శారీ ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చింది. ఈ ఫోటోలలో ఐశ్వర్య రాజేష్ నాజూకు చూపులతో ఇచ్చిన పోజ్‌లు అభిమానులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. అలాగే ఇందులో కొన్ని ఫొటోల్లో ఈమె తన చీర కొంగును మెడపై నుంచి వేసుకుంది. ఈ లుక్ లో కూడా ఈమె ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది.

# ఐపీఎల్ కంటే మా సినిమానే బాగుంటుంది..

టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'పాపం ప్రతాప్' ఈ శుక్రవారం (ఏప్రిల్ 17) థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఎస్.పి. దుర్గా నరేష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 1990ల నాటి గోదావరి గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. ప్రతాప్ (తిరువీర్) తన చిన్ననాటి స్నేహితురాలు బుజ్జమ్మ (పాయల్ రాధాకృష్ణ)ను పెళ్లి చేసుకున్న తర్వాత, ఒక చిన్న సంఘటన వల్ల పంచాయితీలో ఎదురైన అవమానం.. ఆ తర్వాత ఏం జరిగింది అనేదే కథ. ఇందులో అజయ్ ఘోష్, రాశి, రఘు బాబు వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో నటించారు. కె.ఎమ్. రాధాకృష్ణ అందించిన సంగీతం ఇప్పటికే పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. ఈ క్రమంలో చిత్ర యూనిట్ ప్రమోషన్లను హోరెత్తిస్తోంది. అయితే, తాజాగా తిరువీర్ ఐపీఎల్ మ్యాచ్‌తో తన సినిమాను పోలుస్తూ చేసిన ట్వీట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఏప్రిల్ 17న ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య రసవత్తరమైన పోరు జరగనుంది. దీనిపై తిరువీర్ స్పందిస్తూ.. 'థియేటర్స్‌కి రండి.. మిమ్మల్ని ఏమాత్రం నిరాశ పరచను. 17న జరిగే గుజరాత్ vs KKR మ్యాచ్ కన్నా మా సినిమా బాగుంటుంది' అని చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పారు. క్రికెట్ పిచ్చితో ఉన్న ఆడియెన్స్‌ను థియేటర్లకు రప్పించేందుకు తిరువీర్ చేసిన ఈ మాస్టర్ ప్లాన్ అదిరిపోయిందని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.




# ఓటీటీ స్ట్రీమింగ్ కు వచ్చిన ఉస్తాద్..





పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. ఈ ఏడాది మార్చి 19న భారీ అంచనాల మధ్య థియేటర్స్ లో అడుగుపెట్టిన ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. గబ్బర్ సింగ్ వంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన డైరెక్టర్ కావడంతో సినిమాపై ఫ్యాన్స్ ఎన్నో అసలు పెట్టుకున్నారు. కానీ వారిని బాగా నిరాశపరిచింది ఉస్తాద్. దేవి శ్రీ ప్రసాద్ అందించిన పాటలు, థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు కొంత ఆకర్షణగా నిలిచాయి. కానీ అవేవి సినిమాని నిలబెట్టలేక పోయాయి. యాంటీ ఫాన్స్ నుండి భారీగా ట్రోలింగ్ గురైంది ఉస్తాద్. కాగా ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి అడుగుపెట్టింది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ చిత్రం నేటి నుండి స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో విడుదలై నెల రోజులు కాకుండానే ఈ సినిమా ఓటీటీ ప్రేక్షకులను పలకరించడం విశేషం. కేవలం తెలుగులోనే కాకుండా దక్షిణాది భాషలైన తమిళం, మలయాళం, కన్నడతో పాటు హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులోకి వచ్చింది. థియేటర్లో మిస్ అయిన వారు ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో 'ఉస్తాద్' గర్జనను ఆస్వాదించవచ్చు. మరి థియేటర్ లో ఫ్లాప్ అయిన ఉస్తాద్ ఓటీటీలో ఏ మేరకు ఆకట్టుకుంటాడో ఎలాంటి వ్యూస్ రాబడతాడో చూడాలి. మరోవైపు యాంటీ ఫ్యాన్స్ నుండి మరోసారి ట్రోలింగ్ కూడా తప్పేలా లేదు.



# వాయిదా పడిన పళ్లి చట్టంబి..

డిఫరెంట్ కంటెంట్స్‌తో ప్రేక్షకుల మనసుల దోచుకుంటున్న మలయాళ హీరో టొవినో థామస్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'పళ్లి చట్టంబి'. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి డీజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తుండగా.. యంగ్ బ్యూటీ కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ ప్రేక్షకులను ఆకట్టుకోగా.. ఈ మూవీ భారీ అంచనాల మధ్య ఏప్రిల్ 15న రిలీజ్‌కు రావాల్సి ఉండగా వాయిదా పడింది. అయితే మలయాళంలో ఈ చిత్రం ఇప్పటికే రిలీజ్ కాగా.. తెలుగులో మాత్రం కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా వాయిదా వేసి ఈ నెల 17కు పోస్ట్ పోన్ చేశారు. ఈ చిత్రాన్ని బన్ని వాస్ వర్క్స్ పతాకంపై తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. 1950- 60 ల కాలం నాటి చారిత్రక నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రం నుంచి వచ్చిన తెలుగు ట్రైలర్‌తో సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయ్యింది.


# ఆ సినిమా చూసి ఆరేళ్ల పాటు..



'భూత్ బంగ్లా' ప్రమోషన్స్‌లో జోరు పెంచాడు బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్. మలయాళ దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రిలీజ్ సమయం దగ్గర పడుతున్న క్రమంలోనే ప్రమోషన్స్‌లో పాల్గొన్న అక్షయ్ కుమార్.. భూల్ భులయ్య సినిమా చూసి తన కొడుకు ఆవర్ ఫేస్ చేసిన ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. '2007లో విడుదలైన భూల్ భులయ్య సినిమా నా కొడుకుపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ సినిమా చూసిన తర్వాత ఆరేళ్ల పాటు అందులో నటించిన విద్యాబాలన్‌ని చూసి భయపడిపోయాడు. ఆమె మా ఇంటికి వచ్చినప్పుడల్లా భయంతో వణికిపోయేవాడు. ఆమె కళ్లల్లోకి చూసేవాడు కాదు. విద్యాబాలన్‌లో ఆమె భూల్ భులయ్యలో పోషించిన పాత్ర మంజులికను మాత్రమే చూసేవాడు. అందుకే ఆమె వస్తుంది అంటేనే భయంతో పారిపోయేవాడు. అప్పుడు నేనే వాడికి నెమ్మదిక నచ్చజెప్పి.. విద్యాబాలన్ చాలా మంచిదని చెప్పేవాడిని. అయినా ఆ సినిమాలో నుంచి వాడు రావడానికి ఆరేళ్లు పట్టింది' అని చెప్పుకొచ్చాడు.

# మరో స్టార్ హీరోతో 'బంపర్ ఆఫర్'!

కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ తన నేచురల్ యాక్టింగ్‌తో ఇప్పుడు సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీని ఏలేస్తోంది. రిషబ్ శెట్టి ప్రతిష్ఠాత్మక చిత్రం 'కాంతార: చాప్టర్ 1' లో కనకవతిగా పవర్‌ఫుల్ రోల్ దక్కించుకున్న ఈ భామకు ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో సరసన నటించే గోల్డెన్ ఛాన్స్ ఈమెకు దక్కింది. 'లబ్బర్ పందు' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు తమిళరస పద్యముత్తు, తన తదుపరి చిత్రాన్ని ధనుష్‌తో తెరకెక్కించబోతున్నారు. ధనుష్ కెరీర్‌లో 57వ చిత్రంగా రాబోతున్న ఈ సినిమాలో రుక్మిణి వసంత్‌ను హీరోయిన్‌గా ఖరారు చేశారు. గతంలో ఆమె కోలీవుడ్‌లో చేసిన 'ఏస్' (విజయ్ సేతుపతి సరసన), 'మదరాసి' (శివకార్తికేయన్ సరసన) చిత్రాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. కానీ, ఈ ధనుష్ ప్రాజెక్ట్ ఆమెకు కోలీవుడ్‌లో గ్రాండ్ బ్రేక్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కేవలం తమిళంలోనే కాదు, అన్ని ప్రధాన భాషల్లోనూ.. ఎన్టీఆర్, యష్, ధనుష్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకోవడంతో రుక్మిణి వసంత్ కెరీర్ ఇప్పుడు టాప్ గేర్‌లోకి వెళ్ళిపోయింది. ఈ సినిమాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి విడుదలయ్యే 2026-27 సంవత్సరాల్లో రుక్మిణి సౌత్ ఇండియాలో నంబర్ వన్ హీరోయిన్‌గా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు.




Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229